

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


## ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 17 సెప్టెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 40 పేజీలు : 4 వెల : రూ 3-00


## క్వాడ్ సదస్సుకు ముందు మోదీ ద్వైపాక్షిక చర్చలు!



న్యూఢిల్లీ : త్వరలో జరిగే క్వాడ్ సదస్సుకు ముందు ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్ దేశాల అధినేతలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉంది. అమెరికా, భారత్ అధికార వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం, జపాన్, ఆస్ట్రేలియా దేశాల అధినేతలతో సెప్టెంబరు 23న మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. జపాన్ ప్రధాని యొషిహిడే సుగ, ఆస్ట్రేలియా పీఎం స్కాట్ మారిసన్‌లతో మోదీ ఇండో-పసిఫిక్ ప్రాంతంపై చర్చిస్తారు. స్వేచ్ఛాయుత, సౌభాగ్యవంతమైన, నిబంధనల ఆధారిత ఇండో-పసిఫిక్ రీజియన్‌పై చర్చిస్తారు. క్వాడ్ భాగస్వాములతో భారత దేశం టూ ప్లస్ టూ డయలాగ్స్ నిర్వహిస్తుంది. మొదటి ఇండో-ఆస్ట్రేలియన్ డయలాగ్ సెప్టెంబరు 11న న్యూఢిల్లీలో జరుగుతుంది. సెప్టెంబరు 24న అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో చర్చలు జరుపుతారు. ఈ ద్వైపాక్షిక చర్చల తర్వాత క్వాడ్ దేశాల సదస్సు జరుగుతుంది. ఈ సమావేశాలన్నీ వైట్ హౌస్‌లో జరుగుతాయి. క్వాడ్ గ్రూపులోని భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ కూడా భారత్ మాదిరిగానే పరస్పరం ద్వైపాక్షిక చర్చలు జరుపుతాయని తెలుస్తోంది. విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్ ఐక్యరాజ్య సమితి సాధారణ సభ సమావేశం కోసం ఈ నెల 20న అమెరికా బయల్దేరుతారు. అయితే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగే అవకాశాలపై ఇప్పటి వరకు సమాచారం లేదు.క్వాడ్ దేశాలతో రాజకీయ, ఆర్థిక, భద్రత, రక్షణ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవాలని మోదీ ప్రయత్నిస్తున్నారు. క్వాడ్ సదస్సులో తాలిబన్ పాలిత ఆఫ్ఘనిస్థాన్‌పై చర్చ జరుగుతుందని తెలుస్తోంది. దోహా ప్రక్రియలో ఇచ్చిన హామీలను తాలిబన్లు తుంగలో తొక్కడం, సున్నీ పష్తూన్ మద్దతుదారులకే ప్రభుత్వంలో చోటు కల్పించడం, మైనారిటీలు, మహిళలను ప్రభుత్వంలో చేర్చుకోకపోవడం వంటి అంశాలపై చర్చ జరుగుతుందని సమాచారం.

# ఏపీ కేబినెట్

# పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



అమరావతి: ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది. పలు నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశ మందిరంలో రాష్ట్ర మంత్రివర్గ భేటీ జరిగింది. ఈ సమావేశంలో 39 అంశాలపై కేబినెట్ చర్చించింది. వైఎస్సార్ ఆసరా పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.గృహ నిర్మాణానికి రూ.35 వేల రుణ సదుపాయం, 3 శాతం వడ్డీకే రుణాల పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విద్యా, వైద్య సంస్థల సదుపాయాల దాతల పేర్లు 20 ఏళ్లు పెట్టే ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. మైనార్టీలకు సబ్‌ప్లాన్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. వీటితోపాటు పేద వర్గాలకు మేలు చేసేందుకు గృహ రుణాల వన్‌టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యం తెచ్చేందుకు కేబినెట్ నిర్ణయించింది. వివిధ ప్రభుత్వాల హయాంలో ఏపీ హౌజింగ్ కార్పొరేషన్ వద్ద నుంచి లోన్లు తీసుకున్న పేద వర్గాలు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకోవచ్చు.

## కోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: అవంతి

అమరావతి: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించాలనే కోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం..



ప్రసాద్ స్కీంలో అన్నవరం దేవస్థానాన్ని గుర్తించిందని చెప్పారు. ఇప్పటికే సింహాచలం దేవస్థానానికి కూడా ప్రసాద్ స్కీంలో చోటు దక్కిందని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో నాలుగు జోన్లుగా విభజించి టూరిజం దేవాలయాల అభివృద్ధి జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

## నిరుద్యోగుల తరపున పోరాడతాం: చంద్రబాబు



అమరావతి: నిరుద్యోగుల సమస్యలపై టీడీపీ పోరాటం చేస్తుందని మాజీ సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబును ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట కమిటీ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను చంద్రబాబు దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని బాబుకు విన్నవించారు.చంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులను అన్ని విధాలా ఆదుకున్నామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ఒక బూటకమని విమర్శించారు. లక్షల ఉద్యోగాల ఇచ్చామని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు తాము అన్ని విధాలా అండగా ఉంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం..

### గృహ రుణాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యం



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశమైన రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ ప్రభుత్వాల హయాంలో ఏపీ హౌజింగ్ కార్పొరేషన్ వద్ద నుంచి లోన్లు తీసుకున్న పేద వర్గాలకు ఊరట కలిగించేందుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యం తీసుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రవాణా శాఖ మంత్రి పేర్ని నాని సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పేదల గృహ రుణాలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపిందని పేర్ని నాని తెలిపారు. 1983 నుంచి 2011 ఆగష్టు 15 మధ్య వివిధ ప్రభుత్వాల ద్వారా పొందిన ఇంటి స్థలాలపై లోన్లు తెచ్చుకునే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని వారి సొంత ఆస్తిగా మార్చి ఇచ్చేందుకు తీర్మానం చేసినట్లు ఆయన వెల్లడించారు.వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా 46,61,737 మంది లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేల వన్‌టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యం పొందవచ్చన్నారు. మున్సిపాలిటీల్లో రూ.15 వేలు, నగరపాలక సంస్థల పరిధిలోని వారయితే రూ.20 వేలు చెల్లించి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేసుకోవచ్చని తెలిపారు

## హోంమంత్రిని చూస్తే..

## జాలేస్తోంది: అయ్యన్నపాత్రుడు

గుంటూరు: ఏపీ హోంమంత్రిని చూస్తే జాలేస్తోందని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లేని చట్టం పేరు చెప్పి.. ఉరి శిక్ష, జీవిత ఖైదు శిక్షలు వేశామంటూ.. హోంమంత్రి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. లేని దిశ చట్టం కోసం రాజమండ్రిలో దిశ స్టేషన్‌ను ప్రారంభించారని విమర్శించారు. హోంమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోడెల కూడా గతంలో హోం మంత్రిగా చేశారని.. ఆయన్ను చూసి నేర్చుకోవాలని హితవుపలికారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన కొత్తలో కేవలం.. కోడెలను చూసేందుకే విశాఖ నుంచి నరసరావుపేట వెళ్లినట్లు చెప్పారు.కారులో వచ్చి కోడెల మీటింగ్‌ను దూరం నుంచి విని వెళ్లేవాడినని గుర్తు చేశారు. మరుగు దొడ్ల నిర్మాణ అంశంలో జాతీయ అవార్డు పొందారన్నారు. కోడెలను చూసే.. తన నియోజకవర్గంలో స్మశానాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కోడెల కుటుంబానికి తామంతా అండగా ఉంటామన్నారు. జైలులో చిప్ప కూడు తినాల్సిన వారిని.. సీఎంను చేశారని ధ్వజమెత్తారు. సన్న బియ్యమటే తెలియనోడు పౌర సరఫరాల మంత్రి, బెట్టింగ్ రాయుడు ఇరిగేషన్ మంత్రి అని ఎద్దేవా చేశారు. సీఎం లక్షల కోట్ల అప్పులు చేస్తున్నాడని.. అదంతా ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. ఆఖరికి సినిమా టికెట్లు కూడా అమ్ముకుంటున్నారని ఆయన విమర్శించారు.



## హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును స్వాగతిస్తున్నాం: సజ్జల



తాడేపల్లి: రాష్ట్రంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్వాగతించారు. ఆయన గురువారం తాడేపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇన్ని రోజులు పరిషత్ ఎన్నికల ప్రక్రియకు పట్టిన గ్రహణం వీడిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియను అడ్డుకునే కుట్రలు చేశారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలోనే స్థానిక ఎన్నికలు జరగాల్సి ఉందని, ఎన్నికలు జరపకుండా బాబు వాయిదా వేసుకుంటూ వచ్చారని ధ్వజమెత్తారు. ఆ తర్వాత రిజర్వేషన్ల అంశంతో మరికొంత సమయం వాయిదా పడిందన్నారు. గత ఏడాది మార్చిలో ఎన్నికల ప్రక్రియ జరగాల్సి ఉండగా అ?ప్పటికే ఎస్ఈసీ నిమ్మగడ్డ కరోనా పేరుతో ఎన్నికలను వాయిదా చేశారని సజ్జల తెలిపారు. ప్రభుత్వంతో చర్చించకుండానే నిమ్మగడ్డ ఎన్నికలను వాయిదా వేశారని పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలనే నిమ్మగడ్డ అమలు చేశారని అన్నారు. ఏకగ్రీవాలను కూడా అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు.ఎన్నికల ప్రక్రియను హత్య చేసిన దోషి చంద్రబాబు అని సజ్జల మండిపడ్డారు. అడ్డదారులు తొక్కడమే బాబు నైజం అని దుయ్యబట్టారు. ఏడాది తర్వాత ఈ రోజుకు గ్రహణం వీడిందన్నారు. మహిళల భద్రతో కోసం దిశ చట్టం తీసుకోచ్చామని తెలిపారు. 53 లక్షల మందికిపైగా దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. దిశ చట్టం ప్రతులను తగులబెట్టారంటే లోకేష్ మానసికస్థితి అర్థం చేసుకోవాలన్నారు. దిశ చట్టం వల్ల మహిళల్లో ధైర్యం పెరిగిందని, తమకు ఎదురవుతున్న సమస్యలపై ఫిర్యాదులు చేయగలుగుతున్నారని సజ్జల పేర్కొన్నారు.

## ఏపీలో కొత్తగా 1,367 కరోనా కేసులు



అమరావతి: రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై అధికారులు ప్రకటన విడుదల చేసారు. ఏపీలో కొత్తగా 1,367 కరోనా కేసులు నమోదయ్యాయి. తాజాగా కరోనాతో 14 మంది మృతి చెందారు. ఏపీలో మొత్తం 20,34,786 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు కరోనాతో మొత్తం 14,044 మంది మరణించారు. ఏపీలో ప్రస్తుతం 14,705 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు మొత్తం 20,06,034 మంది రికవరీ చెందారు.

### జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు

## ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్



అమరావతి: రాష్ట్రంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు కొట్టేసింది. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించుకోవచ్చని డివిజన్ బెంచ్ తెలిపింది. గురువారం ఉదయం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ అరూప్‌కుమార్ గోస్వామి, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను హైకోర్టు సమర్థించింది.ఈ ఏడాది ఏప్రిల్ 8న 515 జెడ్పీటీసీ, 7220 ఎంపీటీసీలకు ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 10న కౌంటింగ్ నిర్వహించాల్సి ఉండగా హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులతో వాయిదా పడింది. మొదటి నుంచి ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై హైకోర్టు డివిజన్ బెంచ్‌ని ఎస్ఈసీ ఆశ్రయించింది. డివిజన్ బెంచ్ ఉత్తర్వుల మేరకే జడ్పీటీసి, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించామని ఎస్ఈసీ తెలిపింది. మళ్లీ ఎన్నికలు నిర్వహించడం ఈ పరిస్థితులలో అసాధ్యంతో పాటు కోట్లాది రూపాయిలు వృథా అవుతాయని ఎస్ఈసీ పేర్కొంది. నేడు హైకోర్టు.. కౌంటింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో న్యాయ పరమైన చిక్కులు తొలిగాయి. దీంతో కౌంటింగ్ ప్రక్రియకు ఎస్ఈసీ కసరత్తు ప్రారంభించింది.

## సీఎం జగన్ లేఖపై తక్షణం స్పందించిన విదేశాంగ శాఖ

### సీఎం జగన్ చొరవతో బహ్రెయిన్ కార్మికుల వ్యథ సుఖాంతం

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో బహ్రెయిన్‌లో తెలుగువారు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమైంది. బహ్రెయిన్‌లో ఎన్‌హెచ్‌ఎస్ అనే సంస్థలో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీఎం వైఎస్ జగన్ సెప్టెంబర్ 13న కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. దీనిపై తక్షణం స్పందించిన ఆ శాఖ బహ్రెయిన్‌లోని భారతీయ రాయబార కార్యాలయానికి ఆదేశాలు జారీచేసింది. దీంతో అక్కడి సిబ్బంది ఎన్‌హెచ్‌ఎస్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారని, సిబ్బంది తిరిగి విధుల్లో హాజరవడానికి సంస్థ అంగీకరించినట్లు ఏపీఎన్‌ఆర్‌టీ చైర్మన్ వెంకట్ ఎస్ మేడపాటి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహ్రెయిన్ పెట్రోలియం కంపెనీకి సంబంధించిన ఎన్‌హెచ్‌ఎస్ అనే సంస్థ సబ్ కాంట్రాక్టు పనులు నిర్వహిస్తోంది.

# సంపాదకీయం

శుక్రవారం 17 సెప్టెంబరు 2021

## అత్యాచారాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

దేశంలో అడుగుకో కామాంధుడు ఉన్నాడు. గంటకో అత్యాచారం జరుగుతూనే ఉంది. వయసు, వరస మరిచి మానవ మృగాలు రెచ్చిపోతున్నాయి. మరి వీటికి అడ్డుకట్ట వేయాలంటే ఉన్న చట్టాలు చాలవని కఠిన చట్టాలు తెచ్చారు. అయినా ఎందుకు ఆగడం లేదు. జాతీయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ మహిళల భద్రతకు తీసుకున్న చర్యలు.. ఏర్పాటు అయిన కమిషన్లు కూడా ఎందుకు అరికట్ట లేకపోతున్నాయి? ఏం చేస్తే ఆగుతాయి.. ఎలాంటి చర్యలు తీసుకుంటే మహిళలు స్వేచ్ఛగా తిరుగుతారు. 2013లో కేంద్ర ప్రభుత్వం లైంగిక అత్యాచారానికి గురైన మహిళల సంరక్షణ, పునరావాసం కోసం నిర్భయ నిధిని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత నాలుగేళ్లలో దానికి మరో 3వేల కోట్లను జత చేశారు. కానీ ఎంత ఖర్చు చేశారన్నది ఇప్పటికీ లెక్కలు లేవు. దిశ కేసు తర్వాత మరోసారి దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. అటు జాతీయ మహిళా కమిషన్‌కు కూడా వస్తున్న ఫిర్యాదులు వేల సంఖ్యలో ఉంటున్నాయి. పోలీసులు కేసులు పెట్టినా న్యాయం జరగలేదని ఎంతోమంది మహిళలు విమెన్ కమిషన్లను ఆశ్రయిస్తున్నారు. ఇంకా ఎంతో మంది నిర్భయలు బలవుతూనే ఉన్నారు. నిన్నటికి నిన్న ముంబైలో ఓ యువతిని అత్యాచారం చేసి అత్యంత దారుణంగా హింసించి చంపేశారు. ఈ ఘటన గురించి చర్చ ముగియకముందే హైదరాబాద్ నడిబోడ్డున సింగరేణి కాలనీలో జరిగిన ఘటన యావత్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఆరేళ్ల చిన్నారిని చిదిమేశాడు ఓ కామాధుడు. ఇలా నిత్యం ఎన్నో కేసులు వెలుగు చూస్తూనే ఉన్నాయి. అత్యాచారాలే కాదు? అసలు మహిళల జీవించే హక్కే ప్రశ్నార్థకం అవుతోంది. గృహహింస, వరకట్న చావులు, ఆడపిల్ల పేరుతో భ్రూణ హత్యలు ఇలా నిరంతరం వారిపై జరుగుతున్న దాడి ఆందోళన కలిగిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో కూడా నానాటికీ పెరుగుతున్న నేరాలు భయపెడుతున్నాయి. మహిళల భద్రతను పరిస్థితులు ప్రశ్నార్థకం చేస్తున్నాయిఇవే కాకుండా పురుష, సమాజానికి భయపడి లోలోపల వేధనకు గురవుతున్న మహిళలు ఎందరో.. బయటకు చెప్పుకోలేక, హింసను భరించలేక చచ్చి బతుకుతున్న అబలల లెక్కే లేదు..2012లో అత్యాచారా కేసులు 24వేల 923 అయితే? తాజాగా క్రైం బ్యూరో విడుదల చేసిన నివేదిక ప్రకారం 43వేల దాటాయి. అంటే ఈ మధ్య కాలంలో దాదాపు డబుల్ అయ్యాయి. పాత చట్టాలు మహిళలకు భద్రత కల్పించడం లేదని.. తెచ్చిన నిర్భయ చట్టాలు ఎందుకు కట్టడి చేయలేకపోయాయి. 2013లో కేంద్ర ప్రభుత్వం లైంగిక అత్యాచారానికి గురైన మహిళల సంరక్షణ, పునరావాసం కోసం నిర్భయ నిధిని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత నాలుగేళ్లలో దానికి మరో 3వేల కోట్లను జత చేశారు. కానీ ఎంత ఖర్చు చేశారన్నది ఇప్పటికీ లెక్కలు లేవు. దిశ కేసు తర్వాత మరోసారి దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. అటు జాతీయ మహిళా కమిషన్‌కు కూడా వస్తున్న ఫిర్యాదులు వేల సంఖ్యలో ఉంటున్నాయి. పోలీసులు కేసులు పెట్టినా న్యాయం జరగలేదని ఎంతోమంది మహిళలు విమెన్ కమిషన్లను ఆశ్రయిస్తున్నారు. అత్యాచారాలే కాదు? అసలు మహిళల జీవించే హక్కే ప్రశ్నార్థకం అవుతోంది. గృహహింస, వరకట్న చావులు, ఆడపిల్ల పేరుతో భ్రూణ హత్యలు ఇలా నిరంతరం వారిపై జరుగుతున్న దాడి ఆందోళన కలిగిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో కూడా నానాటికీ పెరుగుతున్న నేరాలు భయపెడుతున్నాయి. మహిళల భద్రతను పరిస్థితులు ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇంకా ఎంతటి కఠిన చట్టాలు తీసుకువస్తే గానీ ఆడ బిడ్డలకు రక్షణ కల్పించలేమో అనిపిస్తుంది

# టీటీడీ జంబో పాలకవర్గం

తిరుపతి, సెప్టెంబర్ 16, (న్యూస్ పల్స్)ప్రతిష్ఠాత్మక తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుల నియామకం ఖరారైంది. వివిధ రాష్ట్రాలకు చెందిన అనేక మంది ప్రముఖులు తమ వారిని ఈ బోర్డులో అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి జగన్ కు సిఫార్సు చేసారు. రెండో సారి వరుసగా వైవీ సుబ్బారెడ్డిని ఛైర్మన్ గా నియమించిన తరువాత బోర్డును సైతం వెంటనే ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ దిశగా టీటీడీ బోర్డు కొత్త పాలక వర్గం ఖరారు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. దీనికి సంబంధించిన తుది జాబితా విడుదలైంది. 25మంది సభ్యుల జాబితా ఇలా ఉంది.బోర్డు సభ్యుల వివరాలను ఈ సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అధికారికంగా ప్రకటించారు. పాలకమండలిలో కొత్త వారికే ఎక్కువ అవకాశం కల్పించినట్టు సుబ్బారెడ్డి తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులకు ఎలాంటి అధికారాలు ఉండవని స్పష్టం చేశారు. గత పాలక వర్గంలో మొత్తం 36 మంది సభ్యులు ఉండగా అందులో 24 మంది పాలకమండలి సభ్యులు, 8మందికి ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం కల్పించారు. నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులుగా నియమితులయ్యారు. అయితే ఈసారి ఆ సంఖ్యను కుదించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారికి అవకాశం కల్పిస్తూ పాలకమండలి కూర్పు జరిగింది.ఏపీ నుంచి పోకల అశోక్‌కుమార్, మల్లాడి కృష్ణారావు, వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, గొర్ల బాబూరావు, మధుసూదన్ యాదవ్, తెలంగాణ నుంచి మై హోం అధినేత జూపల్లి రామేశ్వరరావు, జీవన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పార్థసారథిరెడ్డి, మారంశెట్టి రాములు, కల్వకుర్తి విద్యాసాగర్‌రావు, తమిళనాడు నుంచి శ్రీనివాసన్, ఎమ్మెల్యే నందకుమార్, కన్నయ్య, కర్నాటక నుంచి శశిధర్, ఎమ్మెల్యే విశ్వనాథరెడ్డి, మహారాష్ట్ర నుంచి శివసేన కార్యదర్శి మిలింద్‌కు అవకాశం కల్పించారు. మారుతి, సౌరభ్ , కేతన్ దేశాయ్, శ్రీనివాసన్ పేర్లు పాలకమండలి సభ్యుల జాబితాలో ఉన్నట్టు సమాచారం,ఎలా చూసినా దాదాపుగా టీటీడీ బోర్డు పదవుల్లోకి 80 మంది ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. తిరుమల శ్రీవారి ఆలయంలో పదవి అంటే ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. కానీ ఎలా పడితే అలా అందర్నీ నియమిస్తే పవిత్ర దెబ్బతింటుంది. అందుకే గత ప్రభుత్వాలు టీటీడీ బోర్డు సభ్యుల విషయంలో చాలా కఠినంగా ఉండేవి. బోర్డులో పన్నెండు మంది వరకే ఉంచేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చట్టాలను మార్చింది. 24 మంది పాలకమండలి సభ్యులు, నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు, ఏడుగురు ప్రత్యేక ఆహ్వానితులతో పాలక మండలిని ఏర్పాటుచేశారు. ఇప్పుడు ఆ సంఖ్య 80 కి చేరుకునే అవకాశం కనిపిస్తోంది. పాలక మండలి సభ్యుల సంఖ్యను అధికారికంగా పెంచాలనుకున్నా ఇప్పుడు కష్టం కాబట్టి ప్రత్యేక ఆహ్వానితుల కేటగిరిలో చేర్చాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. టీటీడీ బోర్డు సభ్యుడంటే కొన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. కొండ పైన పర్మినెంట్ గా కాటేజీ, ఎప్పుడు వెళ్లినా అవసరాలు చూసుకోవడం, వాహనం, రోజుకు రెండు వందల బ్రేక్ దర్శన టిక్కెట్లు కేటాయిస్తూ ఉంటారు. భక్తుల సొమ్ముతో వారికి ఇవన్నీ కేటాయించాల్సి ఉంటుంది. కేంద్రంలో పనులు చేసుకోవడానికి టీటీడీ బోర్డు పదవుల్ని క్విడ్ ప్రో కో పద్దతిలో ఇస్తున్నారని ఇందు కోసం ప్రత్యేక విమానాల్లో విజయసాయిరెడ్డి పలు రాష్ట్రాలకు వెళ్లి వస్తున్నారని రఘురామకృష్ణరాజు ఆరోపించారు. టీటీడీ బోర్డు సభ్యుల ప్రకటన తర్వాత మరింత దుమారం రేగడం ఖాయంగా కనిపిస్తోంది.

# రాపాక టెన్షన్ ఫ్రీ

రాజమండ్రి, సెప్టెంబర్ 16, (న్యూస్ పల్స్)రాజోలు నియోజకవర్గంలో వైసీపీ ఒక్కొక్క అడ్డును తొలిగించుకుని వెళుతుంది. వైసీపీలో ఉన్న అసంతృప్తులకు చెక్ పెడుతుంది. గత ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గంలో మాత్రమే జనసేన గెలిచింది. అక్కడ విజయం సాధించిన రాపాక వరప్రసాద్ తర్వాతి కాలంలో జగన్ కు మద్దతుదారుగా మారిపోయారు. అయితే ఆయనకు నియోజకవర్గంలో ఏ మాత్రం వైసీపీ నుంచి సహకారం అందడం లేదు. జనసేన క్యాడర్ దూరమయిపోగా, ఇటు వైసీపీ క్యాడర్ దగ్గరకు రానివ్వకపోవడంతో రాపాక వరప్రసాద్ ఒంటరి అయ్యారు. తాజాగా జగన్ నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయడం రాపాక వరప్రసాద్



కు కొంత ఊరటనిచ్చిందనే చెప్పాలి. రాజోలు వైసీపీలో మొత్తం మూడు గ్రూపులున్నాయి. ఒకటి ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ ది కాగా, మరొకటి అమ్మాజీది. ఇక గత ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయని బొంతు రాజేశ్వరరావుది మరొక బలమైన గ్రూపు. ఈ మూడు గ్రూపులతో రాజోలు వైసీపీ క్యాడర్ అయోమయంలో పడింది. ఆధిపత్య పోరు తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రులు సయితం రాపాక వరప్రసాద్ కు అండగా నిలబడటంతో మిగిలిన నేతలు మరింత ఆగ్రహంగా ఉన్నారు. వచ్చే ఎన్నికలలో పోటీ చేసి ఎలాగైనా గెలవాలన్నది వైసీపీ నేత బొంతు రాజేశ్వరరావు ఆకాంక్ష. 2019 ఎన్నికల్లో కేవలం 700 ఓట్ల తేడాతోనే ఓటమి పాలయ్యానని, ఈసారి ఖచ్చితంగా గెలుపుతనదేనని బొంతు రాజేశ్వరరావు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. కానీ రాపాక వరప్రసాద్ వచ్చే ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. జగన్ కూడా అందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడం కొంత ఊరట నిచ్చింది. రూరల్ వాటర్ సప్లై సలహాదారుగా బొంతు రాజేశ్వరరావును జగన్ నియమించారు. దీంతో ఆయన అసంతృప్తి కొంత వరకూ చల్లారినట్లేనని అంటున్నారు. అమ్మాజీకి ఇంతకు ముందే నామినేటెడ్ పదవి దక్కింది. దీంతో మూడు వర్గాలు ఐక్యతగా పనిచేయాలని జగన్ ఆదేశించినట్లు తెలిసింది. మొత్తం మీద ప్రస్తుత ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ టెన్షన్ చాలా తగ్గిందంటున్నారు.

# దూసుకెళుతున్న అదీప్ రాజా

విశాఖపట్టణం, సెప్టెంబర్ 16, (న్యూస్ పల్స్)వైసీపీలో చాలా మంది యువ ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే అందరూ రాజకీయంగా వారు ఎవరూ పెద్దగా రాటుదేలలేకపోతున్నారు. ఉన్న వారిలో దూకుడు చూపించిన వారే జనాల మన్ననలను అందుకుంటున్నారు. వారే రేపటి రోజున మళ్ళీ మళ్ళీ గెలిచేందుకు కూడా బాటలు వేసుకుంటున్నారు ఆ విధంగా ఆలోచిస్తే విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన వైసీపీ యువ ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ మంచి జోరు చూపిస్తున్నారు. ఆయన స్పీడ్ ని అందుకోవడంలో టీడీపీ దాదాపుగా చతికిలపడింది అనే చెప్పాలి. అసలు పెందుర్తి టిక్కెట్ కోసం చాలా మంది తలపండిన నేతలు పోటీ పడ్డారు. అయితే జగన్ చేయించిన పలు సర్వేల్లో అదీప్‌రాజ్ అయితేనే కరెక్ట్ అని తేలడంతో నేరుగా ఆయనకే టిక్కెట్ ఇచ్చారు. అదీప్ రాజ్ కు వైసీపీ హై కమాండ్‌లో అందరు పెద్దల అండదండలు ఉన్నాయి. దాంతో తన నియోజకవర్గానికి అవసరమైనవి అన్నీ ఆయన కోరి మరీ తెప్పించుకుంటున్నారు. పేదలకు ఇళ్ళ స్కీం లో ఆయన పెద్ద ఎత్తున తన నియోజకవర్గానికి ఇళ్ళను తెప్పించుకున్నారు. దాదాపుగా ముప్పై వేల ఇళ్ళను ఆయన పెందుర్తిలో లబ్దిదారుల కోసం ప్రభుత్వం తరఫున కట్టిస్తున్నారు. దీంతో పాటు సంక్షేమ పథకాలు కూడా అర్హులైన అందరికీ దక్కేలా చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా సుడిగాలి పర్యటలను చేస్తూ ప్రజలతో ఎప్పటికపుడు అదీప్ రాజ్ టచ్ లో ఉంటున్నారు. ఈ మధ్యనే అదీప్ రాజ్ తన సతీమణిని కూడా పెందుర్తి సర్పంచ్ గా గెలిపించుకుని సత్తా చాటారు. ఆయన మీద విమర్శలు చేస్తూ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ఆయన కుమారుడు బండారు అప్పలనాయుడు జోరు చేస్తున్నా కూడా కూడా అదీప్ రాజ్ కూడా ధీటుగానే తిప్పి కొడుతున్నారు. మీ హయాంలో ఒక్క ఇళ్ళూ ఇవ్వలేని వారు విమర్శలు చేయడమేంటని సైకిలి పార్టీ గాలి తీసేస్తున్నారు. పాలన అంటే వైసీపీ వచ్చాకనే జనాలకు తెలిసింది అంటున్నారు. తన కొడుకు వయసుతో సమానం అయిన అదీప్ రాజ్ మీద నేరుగా విమర్శలు చేయడానికి బండారు జంకుతున్నారు. మరోవైపు బండారుకు వయస్సు అయిపోవడంతో ఆయన రాజకీయానికి పెందుర్తిలో నూకలు చెల్లిన పరిస్థితే కనిపిస్తోంది. ఇక బండారు తనయుడు అప్పలనాయుడిపై ప్రజల్లోనే కాకుండా.. సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇక అప్పలనాయుడుని అదీప్ రాజ్ అసలు పట్టించుకోవడంలేదు. దీంతో ఈ యువ ఎమ్మెల్యే దూకుడు ముందు టీడీపీ వీగిపోతోంది అనే చెప్పాలి. మరో సారి గెలిచేందుకు సరైన ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు పోతున్న అదీప్ రాజ్ ని కట్టడి చేయడం మాత్రం ఈ టీడీపీ తండ్రి కొడుకుల తరం కావడం లేదనే అంటున్నారు

# రంగంలోకి దువ్వాడ

శ్రీకాకుళం, సెప్టెంబర్ 16, (న్యూస్ పల్స్)సిక్కోలు రాజకీయాల్లో ఆయన రూటే సెపరేట్. అధికారంలో ఉన్న పార్టీలో ఉంటూ కూడా విపక్ష నేతలు సైతం అనుభవించని కష్టాలు పడ్డారు. స్వపక్షంతోనూ, విపక్షంతోనూ ఏకకాలంలో పోరు సలిపారు. ఉన్న ఆస్తులు అమ్ముకున్నారు. రాజకీయంగా అనేక కష్టాలు అనుభవించారు. చివరికి రెండు దశాబ్దాల తరువాత జగన్ దయతో చట్ట సభలలోకి అడుగు పెట్టారు. ఆయనే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్. ఆయనకు వైసీపీలో గురువుగా స్పీకర్ తమ్మినేని సీతారాం ఉన్నారు. సొంత పార్టీలో ఉన్నా కూడా ధర్మాన ప్రసాదరావుతో పెద్దగా కలవరంటారు. ఇక డిప్యూటీ సీఎం క్రిష్ణదాస్ తో రిలేషన్స్ బాగానే ఉన్నాయి. ఇప్పటిదాకా శ్రీకాకుళం జిల్లా రాజకీయం చూస్తే అటు కింజరాపు, ఇటు ధర్మాన ఫ్యామిలీస్ మధ్యనే కేంద్రీకృతమైంది. టీడీపీ అధికారంలో ఉంటే కింజరాపు వారిదే హవా. కాంగ్రెస్ కానీ వైసీపీ కానీ అయితే ధర్మాన వారికే పెద్ద పీట. ఇక ఈ ధోరణిని మార్చాలని జగన్ భావిస్తున్నట్లుగానే ఉంది. అందుకే ఆయన బీసీ నేతలను, ప్రత్యేకించి కాళింగ సామాజికవర్గాన్ని ప్రోత్సహిస్తున్నారు. అందులోనూ ఫైర్ బ్రాండ్ అయిన దువ్వాడ శ్రీనివాస్ ని ముందుండి నడిపిస్తున్నారు. ఆయన కోరకపోయినా ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించారు. విస్తరణ జరిగితే రేసులో ఈ జిల్లా నుంచి తమ్మినేని సీతారామ్, రెడ్డి శాంతి విశ్వాసరాయి కళావతి వంటి వారి పేర్లు మాత్రమే ఇప్పటిదాకా వినిపిస్తున్నాయి. ఇపుడు సడెన్ గా దువ్వాడ శ్రీనివాస్ కూడా ఎంట్రీ ఇచ్చారు అంటున్నారు. దువ్వాడ శ్రీనివాస్ ప్రెస్ మీట్లు ఎపుడూ టెక్కలిలోనే ఎక్కువగా పెడతారు. ఆయన శ్రీకాకుళం పార్టీ ఆఫీస్ దాకా కూడా రారు. అలాంటిది ఏకంగా తాడేపల్లి ప్రధాన కార్యాలయం దాకా వెళ్ళి మరీ అక్కడ మీడియా మీటింగ్ పెట్టారు అంటే కచ్చితంగా జగన్ కళ్లలో పడాలనే తాపత్రయం ఉంది అంటున్నారు. ఇప్పటిదాకా గురువు తమ్మినేని సీతారామ్ కి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ వచ్చిన దువ్వాడ ఇలా దూకుడు చేయడం కూడా శ్రీకాకుళం రాజకీయం వర్గాలలో చర్చనీయాంశంగా ఉంది. ఆయన జగన్ సర్కార్ ని విమర్శిస్తున్న చంద్రబాబు. లోకేష్ లకు గట్టి కౌంటరే ఇచ్చేశారు. ఈ మధ్యకాలంలో ఇంతలా పవర్ ఫుల్ గా టీడీపీ మీద బాణాలు వేసిన వారు కూడా లేరు. దాంతో దువ్వాడ మీడియా మీట్ జగన్ దృష్టిని చేరిందనే అంటున్నారు. కొత్త క్యాబినేట్ ఎలా ఉండాలి అన్న దాని మీద జగన్ ఆలోచనలు చూస్తే దువ్వాడకు చాన్స్ ఉంటుంది అనుకోవాలేమో. యువతకు పెద్ద పీట వేయడమే కాదు, నోరున్న నేతలను కూడా మంత్రివర్గంలోకి తీసుకోవాలని జగన్ భావిస్తున్నారు. ఇక శ్రీకాకుళం అంటే అచ్చెన్నాయుడు, కింజరాపు ఫ్యామిలీ అన్న ముద్ర ఉంది. అచ్చెన్నను ఢీ కొట్టే మొనగాడిగా దువ్వాడ శ్రీనివాస్ ని నిలబెట్టాలి అంటే మంత్రిని చేయాల్సిందే అంటున్నారు. తమ్మినేని సీతారాంమ్ దువ్వాడ శ్రీనివాస్ ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో దువ్వాడ శ్రీనివాస్ కు పదవి ఇచ్చినా సమీకరణలలో తేడా రాదు అని అంటున్నారు. మొత్తానికి జగన్ పిలిచారా. దువ్వాడ వెళ్లారా అన్నది పక్కన పెడితే తాడేపల్లి ఆఫీస్ నుంచి దువ్వాడ చేసిన పొలిటికల్ సౌండ్ మాత్రం అటు వైసీపీ ఇటు టీడీపీ వర్గాలలో అతి పెద్ద చర్చకు తెరలేపుతున్నాయి.

# నిమజ్జనానికి గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, సెప్టెంబర్ 16, (న్యూస్ పల్స్)హైదరాబాద్ మహానగరంలో గణేష్ నిమజ్జనానికి అడ్డంకులు తొలగిపోయాయి. హుస్సేన్‌సాగర్ సహా అన్ని చెరువుల్లో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసుకోవడానికిసుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ నగరంలోని హుస్సేన్‌సాగర్‌లో గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలు విధిస్తూ తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ జీహెచ్‌ఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది.దీనిపై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ ఎన్‌వీ రమణ, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హిమాకోహ్లిలతో కూడిన ధర్మాసనం వాదనలు విన్నది. నిమజ్జనంపై హైకోర్టు ఉత్తర్వులు చివరి నిమిషంలో వెలువడినందున ఈ సంవత్సరం అందులో కొన్ని మినహాయింపులు కోరుతున్నట్లు జీహెచ్‌ఎంసీ ధర్మాసనానికి విన్నవించింది. హైకోర్టు ఉత్తర్వుల్లోని చాలా అంశాలకు తాము కట్టుబడి ఉంటామని, ఒకట్రెండు అంశాలను మాత్రం తక్షణం అమలు చేయలేమని పేర్కొంది.దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు.. హుస్సేన్‌సాగర్‌లో గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసుకోవచ్చని ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఆదేశాలు ఒక్క ఏడాదికి మాత్రమేనని, వచ్చే ఏడాది నుంచి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు నిమజ్జనం చేయడానికి వీల్లేదని పేర్కొంది. పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాల నిమజ్జనంతో హుస్సేన్‌సాగర్ కాలుష్యకారకంగా మారిపోయిందని, జల వనరులను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిమజ్జనంపై ఏటా ఎవరో ఒకరు సుప్రీంకోర్టుకు వస్తున్నారని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వ తీరు సరిగ్గా లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు తీర్పుతో తెలంగాణ ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 19 నిమజ్జనం నిర్వహించాలని నిర్ణయించినందుకు ఆ మేరకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుపై భాగ్యనగర ఉత్సవ సమితి సైతం హర్షం వ్యక్తం చేసింది. మరోవైపు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలపై హైకోర్టు కీలక ఆదేశాలిచ్చిన నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి మట్టి విగ్రహాన్నే నెలకొల్పుతామని కొద్దిరోజుల క్రితమే ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ప్రకటించిన సంగతి తెలిసిందే.హుస్సేన్ సాగర్‌లో గణేషుడి విగ్రహాలు నిమజ్జనం చేయొద్దంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ హైకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తీర్పును పునఃపరిశీలించాలని అభ్యర్థించారు. తీర్పులో ప్రధానంగా 4 అంశాలను తొలగించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలను హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయొద్దంటూ హైకోర్టు ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.అయితే, ఉన్నపళంగా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. నగర వ్యాప్తంగా నెలకొల్పిన గణేషుడి విగ్రహాలు నిమజ్జనం కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లేమీ చేయలేదు. ఎప్పటిలాగే.. హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేయగా.. హైకోర్టు ఉత్తర్వులు ఇబ్బందిగా మారాయి. ఈ నేపథ్యంలోనే.. జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు.హుస్సేన్ సాగర్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనుమతించకపోతే.. నిమజ్జనం పూర్తి కావడానికి 6 రోజులు పడుతుందని జీహెచ్ఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.

# రాజు గారు స్టైల్ మార్చేశారు

విజయనగరం, సెప్టెంబర్ 16, (న్యూస్ పల్స్)ఆయన చంద్రబాబు సమకాలీనుడు. ఇద్దరూ కలసి 1978లో ఒకేసారి చట్ట సభలలో అడుగు పెట్టారు. నాటి నుంచి సుదీర్ఘమైన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. పూసపాటి సంస్థానాధీశుడిగా, తిరుగులేని రాజకీయ నేతగా అశోక్ గజపతిరాజుకు తెలుగు రాష్ట్రాలలో బాగా పేరుంది. టీడీపీ ఆవిర్భావంలో ఎన్టీయార్ వెంట ఉన్న అశోక్ గజపతిరాజు పెద్దాయనకు వెన్నుపోటు పొడిచే ఘట్టాన చంద్రబాబుకు బాసటగా నిలిచి ఆ తరువాత టీడీపీలో కీలకం అయ్యారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన అశోక్ గజపతిరాజు ఈ మధ్య కాలంలో మాత్రం చంద్రబాబుతోనే కాస్త ఎడం పాటిస్తున్నారు. అయితే రాజకీయం ఎపుడూ ఒకేలా ఉండదు, పైగా వైసీపీ సర్కార్ ఆయన్నే కార్నర్ చేస్తోంది. దీంతో దిగిరాక తప్పింది కాదు అంటున్నారు. చంద్రబాబునాయుడు గత రెండున్నరేళ్ళలో అనేక సార్లు పొలిట్ బ్యూరో సమావేశాలు, పార్టీ మీటింగ్స్ నిర్వహించారు. అయితే వాటికి వరసగా డుమ్మా కొట్టిన అశోక్ గజపతిరాజు తాజాగా విశాఖలో జరిగిన ఉత్తరాంధ్రా రక్షణ చర్చా వేదికలో మెరిసి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. మరి బాబు మాటనే అంతగా పట్టించుకోని అశోక్ గజపతిరాజు ఇతర నాయకులతో భుజం భుజం కలిపి మీటింగులో కూర్చోవడం అంటే ఆసక్తికరమే. పైగా రాజా వారు అంటే ఆ లెవెల్ వేరు అంటారు. మరి అన్ని మెట్లు దిగి తమ్ముళ్లతో చెట్టాపట్టాలు వేయడం వెనక వ్యూహం ఏంటి, కారణాలు ఏంటి అని ఆలోచిస్తే బోలెడు ఉన్నాయిట. విజయనగరంలో ఇప్పటిదాకా అశోక్ గజపతిరాజు కేవలం అశోక్ బంగ్లానే టీడీపీ ఆఫీస్ చేసి తానే పార్టీకి పెద్ద దిక్కు అన్నట్లుగా కథ నడిపించారు. చివరికి అశోక్ బంగ్లాను దాటి టీడీపీ ఆఫీస్ వేరు పడిపోయింది. అలా చూస్తుండగానే క్యాడర్ కూడా చెల్లాచెదురు అయింది. మరో వైపు వైసీపీ కాస్తా గట్టిగానే రాజా వారిని టార్గెట్ చేసింది. అటు రికార్డులు మాయమైన వందలాది సింహాచలం భూముల కేసు మీద నిశితంగా దర్యాప్తు జరుగుతోంది. మరో వైపు చూసుకుంటే మాన్సాస్ ట్రస్ట్ కి చెందిన వందలాది ఎకరాలు కూడా మటుమాయం అయ్యాయి. ఇక ఏకంగా అశోక్ గజపతిరాజు ఛైర్మన్ గిరీనే ఒక తడవ లాగేసిన వైసీపీ సర్కార్ ఇపుడు చాన్స్ కోసం ఎదురుచూస్తోంది. దాంతో అటు సంస్థానం, ఇటు రాజకీయం రెండూ కూడా కుదేల్ అయ్యే సీన్ కళ్ల ముందే కనిపిస్తోంది. దాంతోనే రాజకీయ తెలివిడితో అశోక్ గజపతిరాజు తమ్ముళ్ల జట్టుకు వచ్చేశారు అంటున్నారు. అశోక్ గజపతిరాజు అంటే ఊకదంపుడు మాట్లాడరు అంటారు, గాలి కబుర్లు చిల్లర ఆరోపణలు అసలు చేయరని కూడా పేరు. కానీ కాలం ఆయనలో మార్పు తెచ్చింది. అందుకే ఆయన వైసీపీ మీద ఎన్నడూ లేనంతగా గట్టిగానే విమర్శలు చేస్తున్నారు. వీఎమ్మార్డీయే మాస్టర్ ప్లాన్ మీద అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ప్లాన్ 2042 అంటున్నారు వైసీపీ పెద్దలు. అప్పటికి వీరే కనుక పాలిస్తే కచ్చితంగా ఈ ప్రాంతంలో మనుషులు మాత్రం జీవించి ఉండరు అంటూ హాట్ కామెంట్స్ చేశారు.

# తమ్ముళ్ల కొత్త తలనొప్పులు

గుంటూరు, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)ఏపీలో ప్రతిపక్ష పార్టీగా ఉన్న తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు తారస్థాయికి చేరుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఆ జిల్లా ఈ జిల్లా అనే తేడా లేకుండా ప్రతిచోటా నాయకుల మధ్య విభేదాలు స్పష్టంగా నడుస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉంటూ అధికార పార్టీపై పోరాటం చేస్తూ బలపడాల్సిన తెలుగుదేశం పార్టీ, సొంత నాయకుల వల్లే ఇంకా వీక్ అవుతూ వస్తుంది. ఇప్పటికే పలు జిల్లాల్లో నాయకుల మధ్య విభేదాలు స్పష్టంగా బయటపడ్డాయి. ఇటీవలే గోరంట్ల బుచ్చయ్య చౌదరీ పార్టీలో నిజమైన నాయకులకు, కార్యాలర్తలకు తగిన న్యాయం జరగట్లేదని తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకానొక దశలో రాజీనామాకు సిద్ధపడిపోయారు. కానీ చంద్రబాబు సర్దిచెప్పడంతో బుచ్చయ్య వెనక్కి తగ్గారు. ఇక బుచ్చయ్య ఎపిసోడ్‌కు ఎండ్ కార్డు పడుతుందనుకునే సమయంలో అనంతపురంలో జేసి ప్రభాకర్ రెడ్డి కొత్త తలనొప్పి తెచ్చి పెట్టారు. కార్యకర్తలని నాయకులు పట్టించుకోవడం లేదంటూ ఫైర్ అయ్యారు. అలాగే ఇద్దరు నాయకుల వల్ల పార్టీ నాశనమైపోతుందంటూ విమర్శలు చేశారు. అయితే జేసి వ్యాఖ్యలని సొంత పార్టీ నాయకులే ఖండిస్తూ వచ్చారు. వరుసపెట్టి అనంత టిడిపి నేతలు జేసిపై విరుచుకుపడ్డారు. ఇదే సమయంలో జేసి వర్గం?పల్లె రఘునాథ్, ప్రభాకర్ చౌదరీలు?వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డితో ఉన్న ఫోటోలని సోషల్ మీడియాలో వదిలి మరో సంచలనం సృష్టించారు.

# ప్రైవేట్ పరం కానున్న తిరుపతి ఎయిర్ పోర్టు

తిరుపతి, సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)త్వరలో తిరుపతి ఎయిర్‌పోర్టు ప్రైవేట్‌పరం కానుంది. ప్రైవేటీకరణ కానున్న 13 విమానాశ్రయాల్లో తిరుపతి ఎయిర్ పోర్టు కూడా ఒకటి. ఇదేగనుక జరిగితే తిరుచ్చి ఎయిర్ పోర్టు పరిధిలోకి తిరుపతి విమానాశ్రయం రానుంది. తిరుమల దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారు. అంతర్జాతీయ స్థాయిలో విస్తరిస్తే తప్పక లాభాల బాటలో నడిచే అవకాశం ఉంది. ఇటువంటి తరుణంలో ప్రైవేట్ జెండా ఊపడం విమర్శలకు తావిస్తోంది. తిరుచ్చి ఎయిర్‌పోర్ట్ రూ.22 కోట్లకు పైగా లాభాల్లో ఉంది. తిరుపతి ఎయిర్‌పోర్ట్ రూ.35 కోట్ల నష్టాల్లో ఉంది. హైదరాబాద్, విశాఖ, విజయవాడ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఎయిర్ పోర్ట్ కూడా తిరుపతే. కొవిడ్ ప్రభావంతో ప్రయాణికుల సంఖ్య తగ్గటం, విమానాల సర్వీసుల సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాలతో ఈ విమానాశ్రయాలను ప్రైవేటు పరం చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. 1971లో తిరుపతి విమానాశ్రయానికి శంకుస్థాపన జరిగింది. అంచెలంచెలుగా తిరుపతి విమానాశ్రయం అభివృద్ధి చెందుతూ వచ్చింది. నాటి ప్రధాని పివి నరసింహారావు హయాంలో రూ.11 కోట్లతో కొత్త టెర్మినల్ ఏర్పాటు చేశారు. ఆధునీకరించిన విమానాశ్రయాన్ని ప్రధాని వాజ్‌పాయ్ ప్రారంభించారు. 2015లో తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా లభించింది. అదే ఏడాది మరో నూతన టెర్మినల్‌ను ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. కానీ ఇప్పటివరకూ అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభం కాలేదు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో తిరుపతి విమానాశ్రయం ద్వారా 8,40,963 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. కేవలం హైదరాబాద్, ఢిల్లీ, విజయవాడ, విశాఖపట్నంలకు విమాన సర్వీసులు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయం స్థాయిని అందుకునేందుకు రన్ వేను 3,810 మీటర్లకు అనగా 12500 అడుగులకు విస్తరించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 712 ఎకరాల భూమిని ఎయిర్ పోర్ట్స్ అథారిటీకి అప్పగించింది. 200 కోట్ల రూపాయలతో రన్ వే విస్తరణ, పార్కింగ్ పనులకు ఇది వరకే ఆమోదం పొందింది. రెండు వీఐపి లాంజ్‌లు, 250 కార్లు పార్కింగ్ చేయగల సామర్థ్యం ఉంది. 2020 మార్చిలో 44,575 మంది ప్రయాణీకులు ప్రయాణించగా.. 2021 మార్చిలో 65,110కి పెరిగింది. 2019 ఏప్రిల్ నుంచి 2020 మార్చి వరకు 8,34,984 మంది ప్రయాణికులు తిరుపతికి ప్రయాణించారు. కొవిడ్ కారణంగా కొంతమేర విమాన ప్రయాణాలు నిలిచిపోవడంతో 2020 ఏప్రిల్ నుంచి 2021 మార్చి వరకు 3,52,375 మంది రాకపోకలు సాగించారు. ఎయిర్ పోర్టుల ప్రైవేటీకరణ ప్రక్రియలో తొలిసారి మేజర్ ఎయిర్ పోర్టులతో చిన్న ఎయిర్ పోర్టులను కలుపుతున్నారు.

## స్టీల్ ఉద్యమానికి బృందా కారత్ మద్దతు

విశాఖపట్నం సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్) విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రధాన ద్వారం వద్ద దీక్షలు చేపట్టిన కార్మిక సంఘాల నేతలకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ సంఘీభావం తెలిపారు. నేటితో 216వ రోజుకు కార్మికుల రిలేనిరహార దీక్షలు చేరుకున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, చేస్తున్న పోరాటానికి మా పూర్తి మద్దతు ను తెలియజేస్తున్నామని, విశాఖ స్టీల్ ప్లాంట్ లో వేల మంది కార్మికుల కృషి ఉందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ అన్నారు. మోదీకి విశాఖ స్టీల్ ప్లాంట్ యొక్క చరిత్ర, త్యాగాల గురించి తెలుసా అని ప్రశ్నించారు. అన్ని యూనియన్లు కలిసి చేస్తున్న పోరాటం కచ్చితంగా ఫలిస్తుందని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు దేశానికి వెన్నుముక అని అన్నారు. బిజెపి ప్రభుత్వం దేశాన్ని ప్రైవేటువ్యక్తులకు అమ్మాలి అనుకుంటుందని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రజల ఆస్తి అని, వ్యవసాయాన్ని కాపాడటానికి ఢిల్లీ లో రైతులు దీక్షలు చేపడుతున్నారని, మోదీ పుట్టిన రోజున విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేట్ పరం వ్యతిరేకంగా గ్రీటిగ్ కార్డులతో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27 న దేశవ్యాప్త సమ్మె కు రైతులు సిద్ధం అవుతున్నారని అన్నారు.

## ఈనెల 18న రైతు నిరసన కార్యక్రమం

నక్కా అనంద్ బాబు



తెనాలి సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్) రైతు కోసం తెలుగుదేశం 18న రైతు నిరసన కార్యక్రమ నిర్వహిస్తున్నామని మాజీమంత్రి నక్కా ఆనంద్ బాబు అన్నారు. గురువారం అయన తెనాలి టీడీపీ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతు నిరసన కార్యక్రమాలు 5 జోన్లు గా విభజించి కార్యక్రమాలు చేపడుతున్నాం. రైతు కార్యక్రమం జోన్ 3 క్రింద మన ప్రాంతంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నాం. జగన్ ప్రభుత్వం 2.5 సంవత్సరాలు కాలంలో రైతు పట్ల వెతిరేక, నిర్లక్ష్య విధానాలు వల్ల రైతులు తీవ్రమగా నష్టపోతున్నరని అన్నారు. రైతులను చైతన్య పరిచే విధంగా రైతు కోసం తెలుగుదేశం కార్యక్రమం చేపడుతున్నామం. జగన్ ఎన్నికల ముందు అనేక బూటకపు మాటలు హామీలు ఇచ్చారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేవు. కొన్న రైతుల వద్ద పండించిన పంటలు 25% కూడా కొనుగోలు చెయ్యని జగన్ ప్రభుత్వం. రైతుల పండించిన పంట కొనుగోలు విషయం లో వైస్సార్సీపీ నాయకులు కమిషన్ అవతారం ఎత్తారు. జగన్ ప్రభుత్వం రైతుల కోసం 3వేల కోట్లు స్త్రీకరణ నిధులు ఏర్పాటు చేస్తామని చెప్పారు ఎక్కడ ఉంది ఆ నిది. ఈ రోజుకి కూడా ప్రభుత్వం రైతుల దగ్గర కొన్న పంటలకు డబ్బులు చెల్లించలేదు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు వాటివల్ల రైతులకు ఏమి ప్రయోజనం కనీసం ఒక్కరైతుకుకన్న ఎరువు బస్తా అన్న ఇచ్చారా. రైతులకు ఒక్కచోటన్న వ్యవసాయ పానిముట్లు ఒక్కరికి అన్న ఇచ్చారా. జగన్ ప్రభుత్వం రైతు పెట్టుబడి క్రింద 12ఇస్తానని చెప్పి వాటిలోని 6వేల రూపాయలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. జగన్ ప్రభుత్వం లో ఒక్క రైతు అన్న ఆనందంగా ఉన్నరేమో చూడండి. జగన్ వచ్చాక రైతులు వ్యవసాయ చెయ్యకుండా పారిపోయే పరిస్థితులు కల్పించారు. ముందు చూపుతో పట్టుసీమ నిర్మాణం చేసి డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత చంద్రబాబు ది. ప్రాజెక్టులు చేసే ఉద్దేశం లేకనే పక్క రాష్ట్రాలతో జగడం సృష్టించుకొని ప్రజలను భ్రమలో ఉంచుతున్నారు. అన్ని రకాలుగా అవినీతి లో జగన్ ప్రభుత్వం కూరుకుపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంన్నీ ఎన్ని రకాలుగా దోచుకోవలో అన్ని రకాలుగా జగన్ ప్రభుత్వం దోచుకుంటుంది. తెనాలి, వేమూరు నియోజకవర్గ రైతులు తెనాలిలో రైతుల సహకారంతో నిరసన కార్యక్రమ చేపడతామని అన్నారు. విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంలో 3వ విడత రైతు నిరసన కార్యక్రమం నిర్వహిస్తారని అయన వెల్లడించారు.

## వానలే..వానలు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 16, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రధానంగా తక్కువ ఎత్తులో పశ్చిమ/నైరుతి గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు, రేపు , ఎల్లుండి ఉత్తర కోస్తా ఆంధ్రాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేక రెండు ప్రదేశములలో కురిసే అవకాశం ఉంది. దక్షిణ కోస్తా ఆంధ్ర :ఈరోజు, రేపు , ఎల్లుండి దక్షిణ కోస్తా ఆంధ్రాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేక రెండు ప్రదేశములలో కురిసే అవకాశం ఉందిరాయలసీమ:ఈరోజు, రేపు , ఎల్లుండి రాయలసీమలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేక రెండు ప్రదేశములలో కురిసే అవకాశం ఉంది. రాష్ట్రాల్లో గత వారం పది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్ని విషయం తెలిసిందే. రెండు, మూడు రోజుల నుంచి కొంత గ్యాప్ ఇచ్చినట్లు కనిపించినా రోజులో ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది.

# ప్రభుత్వ విద్యాసంస్థల ఏర్పాటుకై ఆర్డీఓ కార్యలయం ముట్టడి

ఆదోని విద్యార్థి సంఘాల జేఏసీ

కౌతాళం సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్ ఆదోనిలో ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని , ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని కోరుతూ ఆదోని విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదోని ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ గౌరవ సలహాదారులు సాబీర్ బాష,గౌరవ అధ్యక్షులు రామాంజనేయులు,జేఏసీ చైర్మన్ నాగరాజు,కన్వీనర్ శ్రీనివాసులు,మీడియా ఇంఛార్జి రమేష్ మాట్లాడుతూ ఆదోని పట్టణంలో ప్రభుత్వ విద్యారంగ సంస్థలు లేక గ్రామిణ,పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దశాబ్దాలుగా ఆదోని లో ప్రభుత్వ విద్యారంగ సంస్థలు ఏర్పాటు చేయాలని అనేక విద్యార్థి సంఘాలు పోరాడుతున్న ఇక్కడ ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు లేక,అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వ ప్రజాప్రతినిధులు స్పందించి ఆదోనిలో ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని,ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ రామకృష్ణ రెడ్డి గారికి వినతిపత్రం అందజేశారు. ఆర్డీఓ గారు మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆదోని లో విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ లు శివరాం,శివలోకేశ్, రామకృష్ణ,తేజ,పవన్ , జేఏసీ కమిటీ సభ్యులు సోమశేఖర్, సూర్య,దస్తగిరి, నాగరాజు,మల్లి, జయకర్,రాజరత్నం,మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇ- క్రాప్ డేటా మాయం

విజయవాడ, సెప్టెంబర్ 16, (న్యూస్ పల్స్)ఇ-క్రాప్ డేటా కరప్టు వ్యవహారం ఇటు రైతులకు అటు వ్యవసాయ సిబ్బందికి కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది నేరుగా రైతుల పొలాల వద్దకెళ్లి పంటల సాగు నమోదు మొత్తం ప్రక్రియ పూర్తి చేశాక ఇ?క్రాప్ యాప్‌లో డేటా మిస్ అవుతోంది. సేకరించిన డేటాలో కొంత భాగం కనబడకుండా పోవడంతో రైతులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. యాప్ పని తీరుపై వ్యవసాయశాఖ రాష్ట్ర హెడ్ క్వార్టర్‌కు క్షేత్ర స్థాయి నుండి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ పై స్థాయిలో ఉలుకు పలుకు లేదని ఆరోపణలస్తున్నాయి. వ్యవసాయాధికారుల సంఘాలు ఇటీవల కమిషనర్‌ను కలిసి స్టాఫ్ సమస్యలపై చర్చించిన సమయంలో ఇ?క్రాప్ డేటా కరప్టు అంశాన్ని ప్రధానంగా లేవనెత్తినట్లు తెలిసింది. అయినప్పటికీ ఇంకా సరి చేయలేదని సిబ్బంది వాపోతున్నారు. పంటల బీమా, సున్నా వడ్డీ, రైతు భరోసా, కౌలు రైతుల గుర్తింపు, సర్కారీ కొనుగోలు కేంద్రాల్లో పంటల అమ్మకాలు, సీడ్ సబ్సిడీ సహా రైతుల కోసం అమలు చేస్తున్న సమస్త పథకాలకు ఇ-క్రాప్ నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించే విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఎఎ) చేల వద్దకెళ్లి ఏ పంట సాగు చేస్తున్నారో తెలుసుకొని రైతును అక్కడ నిలబెట్టి ఫోటో తీసి ఇ-క్రాప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆధార్, బ్యాంక్ అక్కౌంట్, పట్టాదారు పాస్ పుస్తకం, అడంగల్ కాపీ, సిసిఆర్‌సి కార్డు వీటినీ నమోదు చేయాలి. రెవెన్యూ డిపార్టుమెంట్‌కు చెందిన వెబ్‌ల్యాండ్ డేటా మ్యాచ్ కావాలి. బయో మెట్రిక్‌లో రైతు వేలిముద్ర సేకరించాలి. ఈ ప్రక్రియ అంతా సక్రమంగా పూర్తయ్యాక, హెడ్ క్వార్టర్ నుండి అధీకృత (అథంటికేషన్) సంకేతం వస్తేనే ఇ-క్రాప్‌లో రైతు పేరు నమోదవుతుంది. ఈ తతంగం మొత్తం ఆన్‌లైన్‌లోనే జరగాలి. నెట్, సర్వర్ సమస్యలు మామూలే. టెక్నికల్ సమస్యలు లేకుంటే ఒక రైతు ఇ-క్రాప్ బుకింగ్‌కు 8- 10 నిమిషాలు పడుతుంది. ఇంతా చేశాక సేకరించిన డేటా కరప్టు అవుతోంది. వెయ్యి ఎకరాల సాగు డేటా రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తే అందులో 10-20 శాతం డేటా కరప్టు అవుతోందని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మధ్యలో 'అప్‌డేట్ వెర్షన్' అని వస్తోందని, డేటా పోతోందని లబోదిబోమంటున్నారు. సేకరించిన డేటాలో ఎంత, ఎక్కడ మిస్ అయిందో గుర్తించడానికి నానా ఇబ్బందులూ పడాల్సి వస్తోందని, మిస్ అయిన డేటా సేకరణకు మళ్లీ పొలాల వెంట తిరగాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఈ ఖరీఫ్ నుండి ప్రభుత్వం డిజిటల్‌తో పాటు ఇ?క్రాప్ చేయించుకున్న రైతులకు మాన్యువల్ రసీదులిచ్చే పద్ధతిని ప్రవేశపెట్టింది. సిబ్బంది చేల వద్దకు వెళ్లకుండా, కార్యాలయాల్లో కూర్చొని ఇ?క్రాప్ డేటాను అప్‌డేట్ చేస్తుండటం వలన రైతులకు పథకాలు అందట్లేదన్న ఆరోపణల నేపథ్యంలో రసీదులను తీసుకొచ్చింది. రసీదు ఇచ్చాక డేటా కరప్టు అయితే రైతులు నిలదీస్తున్నారని, రెండవ సారి సమాచార సేకరణకు సహకరించట్లేదని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో దాదాపు 95 లక్షల ఎకరాలు సాగవుతుందని అంచనా. ఆ మొత్తం డేటాను ఇ?క్రాప్‌లో నమోదు చేయాలి. పథకాల లబ్ధికి ఇ?క్రాప్‌ను తప్పనిసరి చేసినందున డేటా కరప్టు అయితే రైతులకు నష్టం. ఇదే సమయంలో సిబ్బందికి ప్రాణసంకటం.

# ఎర్ర గంగిరెడ్డి అరెస్ట్

కడప, సెప్టెంబర్ 16, (న్యూస్ పల్స్)వైఎస్ వివేకా హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకోనున్నట్లు తెలుస్తోంది. ? వివేకానందరెడ్డి ప్రధాన అనుచరుడు, చాలాకాలం ఆయన్ను వెన్నంటే ఉన్న ఎర్ర గంగిరెడ్డిని? సీబీఐ అధికారులు అరెస్టు చేయనున్నట్లు సమాచారం. వివేకా హత్య కేసులో సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డిని ఇప్పటికే అరెస్టు చేయగా.. మూడో నిందితుడిగా ఎర్ర గంగిరెడ్డిని అరెస్టు చేసే చాన్స్ ఉంది. బుధవారం మధ్యాహ్నం గంగిరెడ్డిని పులివెందుల నుంచి కడపకు తీసుకొచ్చారు. సాయంత్రం 5 గంటల వరకూ విచారించి? ఆ తర్వాత కడప రిమ్స్‌కు తీసుకెళ్లి కరోనా సహా, ఇతర వైద్య పరీక్షలు చేయించారు. గురువారం పులివెందుల కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం కూడా వివేకా ఇంట్లో సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేసిన సీబీఐ అధికారులు.. ఎర్ర గంగిరెడ్డి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి ఎలా ఇంట్లోకి ప్రవేశించారు, ఎక్కడెక్కడ దాక్కున్నారు, గేటు తీసుకొని ఎలా వెళ్లారు, బైక్‌పై ఎవరెవరు వచ్చారు, హత్య జరిగిన తర్వాత ఎలా ఎస్కేప్ అయ్యారు వివరాలను పరిశీలించారు. హత్య ఎలా జరిగిందో కల్పిత పాత్రలతో సీబీఐ అధికారులు వీడియో షూట్ చేశారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ సమయంలో ఇంట్లో ఉన్న వివేకా కుమార్తె సునీతతో అధికారులు గంట పాటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసులో నిందితుల పాత్రపై చర్చినట్లు తెలుస్తోంది. 2019 మార్చి 14న ఎన్నికల ప్రచారం ముగించుకుని రాత్రి 11 గంటల 30 నిమిషాలకు ఇంటికి చేరుకున్న వివేకా.. మార్చి 15 తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యారు. వివేకా ఇంటికి వచ్చినపుడు కారులో ఆయనతోపాటు

ఎర్ర గంగిరెడ్డి మాత్రమే ఉన్నారు. ఆ తర్వాత గంగిరెడ్డిని ఆయన ఇంటి వద్ద దిగబెట్టి? వివేకా తన ఇంటికి వచ్చారు. అర్ధరాత్రి దాటాక తర్వాత నలుగురు వ్యక్తులు వివేకా ఇంట్లోకి చొరబడి ఉంటారని సీబీఐ అధికారులు భావిస్తున్నారు. వారిలో ఎర్ర గంగిరెడ్డి పాత్ర కూడా ఉన్నారని సీబీఐ ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. హత్య జరిగిన రోజు ఇంట్లో సాక్ష్యాధారాలు చెరిపేశారనే అభియోగాలపై 2019 మార్చి 28నే సిట్ అధికారులు గంగిరెడ్డిని అరెస్టు చేశారు. అప్పట్లో 90 రోజుల పాటు జైల్లో ఉన్న గంగిరెడ్డి? ఆ తర్వాత బెయిల్‌పై బయటికొచ్చారు. ఇప్పుడు 302 సెక్షన్ కింద మరోసారి అరెస్టు చేశారు

# నేరాల నియంత్రణలో సిసి కెమెరాలు కీలకం

సింగరేణి సహకారంతో మెట్ పెల్లిలో 32 సిసి కెమెరాలు ప్రారంభం

కోరుట్ల సెప్టెంబర్ 16 ప్రస్తుత రోజుల్లో నేరాలను నియంత్రణతో పాటు నేరస్థులను గుర్తించడంలో సిసి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. గురువారం మెట్ పెల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను జిల్లా ఎస్పీ సింధు శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సింగరేణి వారి సహకారంతో ఈరోజు పట్టణాలో సుమారు 15 లక్షల విలువగల 32 సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. సిసి కెమెరాల ఎర్పాటు చేసి నేరాల నియంత్రణలో పరోక్షంగా భాగ స్వాములైన సింగరేణి సి.ఎం.డి శ్రీధర్ కి ఈ సందర్భంగా ఎస్పీ కృతజ్ఞతాలు తెలిపారు. ఈ సీసీ కెమెరాలను మెట్ పెల్లి పోలీస్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేయడం జరిగిందని, ప్రస్తుత రోజుల్లో ఎలాంటి నేరాలను జరిగిన వాటిలోని నేరస్తులను కనుగోనడంలో సిసి కెమెరాలు పోలీసులకు ఒక అయుధంగా నిలుస్తోందిఅన్నారు. సిసి కెమెరాల ద్వారా సేకరించిన సాక్ష్యాల ద్వారా నేరస్థుడు పాల్పడిన నేరాన్ని కోర్టు నిరూపించ వచ్చని అన్నారు. ఈ సీసీ కెమెరాలను ప్రధాన రోడ్డు మార్గాల్లో ఎర్పాటు చేయడం ద్వారా జరిగిన రోడ్డు ప్రమాదాలపై తగు సమిక్షా జరిపి రోడ్డు ప్రమాదాల నివాణకు తగిన జాగ్రత్తాలు తీసుకోవచ్చు అన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం సిసి కెమెరాలను ఎర్పాటు చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి డిఎస్పీ గౌస్ బాబా ,సి.ఐ శ్రీను, ఎస్.ఐ లు సదాకర్, రాజునాయక్, రాజాప్రమిలా,పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

# టిటిడి బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడిగా భూమన, , ఎక్స్ అఫిషియో సభ్యునిగా డా. చెవిరెడ్డి ప్రమాణస్వీకారం

తిరుమల, సెప్టెంబర్ 16, టిటిడి నూతన ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితుడిగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఎక్స్ అఫిషియో సభ్యునిగా తుడ ఛైర్మన్ డా.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత టిటిడి అదనపు ఈవో ఎ.వి.ధర్మారెడ్డి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. భూమన కరుణాకర్‌రెడ్డి, డా.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అదనపు ఈవో శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు అనంతరం ఆలయం వెలుపల కరుణాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి కృపతో రెండో సారి టిటిడి బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బోర్డు ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి నేతృత్వంలో పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. హైందవ ధర్మ సంస్కృతిని, ఆచారాలను కాపాడడంతోపాటు టిటిడి ప్రతిష్టను మరింత పెంచేందుకు కృషి చేస్తానన్నారు.

# రోజుల పాటు 3516 మంది కార్యకర్తల కుటుంబాలతో భేటీ

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు సెప్టెంబర్ 16, నెల్లూరు గ్రామీణ నియోజక వర్గంలో ఎన్ని కష్టాలు వచ్చిన ఎన్నో ఏళ్లుగా నమ్ముకుని ఉన్న కార్యకర్తలను పలుకరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకు నేను- నా కార్యకర్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రకటించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అపోలో హాస్పిటల్ వద్ద నున్న రాము అనే వైసీపీ కార్యకర్త నివాసం నుంచి నేను - నా కార్యకర్త కార్యక్రమానికి సంబంధించి పాదయాత్ర గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 రోజుల పాటు 3516 మంది కార్యకర్తల కుటుంబాలతో భేటీ అవుతున్నట్లు తెలిపారు. వారి కష్టనష్టాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్ర స్థాయిలో తెలుసుకోనున్నామన్నారు. మధ్యాహ్నం ఓ సామాన్య కార్యకర్త నివాసంలోనే భోజనం చేస్తానని, ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పాదయాత్ర సాగుతుందని ఆయన వివరించారు.

కార్యకర్తలు బాగుంటేనే తాను బాగుంటానని కార్యకర్తల కష్టం తనకు ఎమ్మెల్యే కోటంరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు ,కోటంరెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ మండలి ప్రత్యేక ఆహ్వానితుడిగా భుమన

తిరుమల తిరుమల టీటీడీ పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితునిగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసారు..ఇవాళ ఉదయం శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో భూమన కరుణాకర్ రెడ్డి చేత టిటిడి అదనపు ఈవో ఏవి ధర్మారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నా రు..స్వామి వారి దర్శనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం చేయగా..ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసారు.. అనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ..స్వామి వారి దయతో, కృపతో,సీఎం జగన్ ఆశీర్వాదంతో వెంకటేశ్వర స్వామి సన్నిధిలో సేవ భాగ్యం దక్కిందన్నారు..పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితునిగా నియమించబడటం చాలా సంతోషంగా ఉందని,గత పాలకమండలిలో వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆధ్యాత్మిక కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహించడం జరిగిందన్నారు..

## మద్దతు ధరకోసం టీడీపీ ధర్నా

పూతలపట్టు సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్) పెంచిన కరెంట్ బిల్లులను,నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని,పంటలకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ పూతలపట్టు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్లు,నాయకులు ధర్నా నిర్వహించారు. ఎన్నికల్లో గెలవడానికి అలవికాని హామిలిచ్చి గద్దె నెక్కిన జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఘోరంగా విఫలమయ్యారని, రాష్ట్రంలో నిత్యావసర వస్తువులతో పాటు కరెంట్ బిల్లులను పెంచి పేద, మధ్య తరగతి ప్రజలను అప్పులపాలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు దుయ్యబట్టారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి పూతలపట్టు తహసీల్దార్ కు వినతిపత్రం అందించారు. పూతలపట్టు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వినాయక గౌండర్ ఆధ్వర్యంలో ఐరాల, యదామర్రి, తవనంపలి, బంగారుపాళ్యం మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్లు,నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## ఏవోబీలో ఎదురుకాల్పులు

విశాఖపట్నం సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్) ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఒడిశాలోని మల్కన్గిరి జిల్లా అటవీప్రాంతంలో బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దాంతో ఇరువురి మధ్య కాల్పులు జరిగాయి. మావోయిస్టు అగ్ర నాయకుడుతో సహామరికొంతమంది ఎదురుకాల్పుల నుంచి తప్పించుకున్నట్లు ఒడిశా పోలీసుల వెల్లడించారు. వారిలో ఏవోబీ ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యుడు జాంబ్రి వున్నట్లు సమాచారం. ఘటనా స్థలినుంచి పెద్ద ఎత్తున మావోయిస్టు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. మల్కన్ గిరి ఎస్పీ ప్రహల్లాద్ మీనా తెలిపిన వివరాలు ప్రకారం మల్కన్ గిరి మరియు కోరాపుట్ జిల్లాల సరిహద్దులోని బడిలి కొండపై ఒక పెద్ద మావోయిస్టు శిబిరం ఉన్నట్లు నిఘా వర్గాలు తెలిపిన తరువాత, ఎస్‌వోజీ, డీవీఎఫ్ మరియు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆ ప్రాంతంలో గాలింపు నిర్వహించామని బుధవారం బాగా పొద్దుపోయాక గాలింపు బలగాలు మావోయిస్టులు నిర్వహిస్తున్న శిభిరానికి చేరుకోగానే మావోయిస్టులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు ప్రతిగా కాల్పులు జరిపారు. సుమారు రెండు గంటల పాటు మావోయిస్టులకు పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయని ఎస్పీ తెలిపారు. మావోయిస్టులు కాల్పులు జరుపుకుంటూ శిభిరం నుంచి తప్పించుకున్నారు.

## ఊటపల్లిలో పాఠశాలకు వెళు తుండగా కిడ్నాప్ యత్నం

పోలీసుల చిక్కిన నిందితులు

విజయనగరం సెప్టెంబర్ 15, (న్యూస్ పల్స్)విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం ఊటపల్లిలో కిడ్నాప్నకు యత్నం జరిగింది. ముగ్గురు పాఠశాల విద్యార్థినులను కిడ్నాప్ చేసేందుకు ముగ్గురు దుండుగులు ప్రయత్నించారు. ఊటపల్లి నుంచి మెరకముడిదాం ఉన్నత పాఠశాలకు విద్యార్థులు సైకిల్పై వెళు తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యార్థులను ట్రై సైకిల్ వాహనంలో ఎక్కిస్తుండగా వాహనదారులు గమనించి గ్రామస్థులకు సమాచారమివ్వగా.. వారిని బంధించారు. భక్తుల వేషధారణతో కిడ్నాప్నకు యత్నించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## జీవీఎంసీ అదాయానికి గండి కొడుతున్న మేయర్

విశాఖపట్నం జీవీఎంసీ మేయర్ ,కమిషనర్ ఆధ్వర్యంలో అడ్డగోలుగా కమిటీలు వేసి జివిఎంసి ఆదాయానికి గండి కొడుతున్నారు అని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు.. విశాఖపట్నంలొ నిర్వహించిన మీడియా సమావేశంలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ జీవీఎంసీ షాపులు, షాపింగ్ కాంప్లెక్స్ లు, కళ్యాణ మండపాలు, మార్కెట్లు విషయంలో లీజుదారుల నుంచి లీజ్ డబ్బులు వసూలు చేయకుండా ఇప్పటివరకు జీవీఎంసీ అధికారులు తాత్సారం చేస్తూ వస్తున్నారని.. దీనివల్ల మొండిబకాయిలు కుప్పలుతెప్పలుగా పెరిగిపోయాయని ఆయన అన్నారు... జీవీఎంసీ సంబంధించి లీజుదారుల నుంచి తక్షణం బకాయిలు వసూలు చేయాలనె విషయం జీవీఎంసీ కమిషనర్ కు జోనల్ స్థాయి అధికారులకు తెలిసినా కూడా బకాయిల వసూలు చేయకుండా జివిఎంసి రెవెన్యూకి గండి కొడుతున్నారని అన్నారు.. మున్సిపల్ చట్టం ప్రకారం ఏదైనా కమిటీని నియమించాలి అంటే 2/3 మెజారిటీ ఉండాలని 2/3 మెజారిటీ తో పాటుగా కౌన్సిల్ లో తీర్మానం చేయాలని.. అలా కాకుండా జీవీఎంసీ కమిషనర్, మేయర్ తమకు ఇష్టం వచ్చినట్లుగా నూతన కమిటీలను ఏర్పాటు ఆయా కమిటీల ద్వారా లీజు దారుల నుంచి అక్రమ దారుల నుంచి అడ్డగోలుగా కమీషన్లకు కక్కుర్తిపడి లీజు బకాయిలు పెండింగ్ ఉన్న సరే అటువంటి దుకాణాల పై చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు

# నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా ప్రభుత్వాలు ఎస్ఎఫ్ఐ



## డివైఎఫ్ఐ అధ్వర్యం ఎమ్మార్వో కి వినతి

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 16,( విభారె) ) దేశ అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి అని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి. రామన్న అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం యర్రకోట గ్రామంలో వీరాంజినేయులు అనే నిరుద్యోగి ఆత్మహత్య చేసుకుని ఐదు రోజులు అయినా ఒక్క ప్రజాప్రతినిధి, అధికారులకు కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించే తీరిక లేక పోవడం బాధాకరమన్నారు. వీరాంజినేయులు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆజఈఎ - ాఈఎ ఆధ్వర్యంలో ఎమ్మిగనూర్ టౌన్ లో సోమప్ప సర్కిల్ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల్లో ఆత్మస్తైర్యం నింపల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేవలం ఎన్నికల ముందు కల్లిబోల్లి కబుర్లు చెప్పి ఓట్లు దండుకోని వదిలేస్తున్నరని విమర్శించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏ చర్యలు చేపట్టిందో బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ పై నిరుద్యోగులు పెద్ద ఎత్తున పోరాడుతుంటే వారి పై తప్పుడు కేసులు బనాయించడం ప్రభుత్వ చేతకాని తననికి నిదర్శనం అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 20 లక్షల పోస్టులు , రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1.83 లక్షల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వరంగ సంస్థల అమ్మడం ఆపి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే స్వగ్రామంలోనే ఒక నిరుద్యోగి ఆత్మహత్య చేసుకుంటే చూడటానికి వేళ్లన ప్రజాప్రతినిధులు ఉండటం సిగ్గుచేటన్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీరాంజినేయులు కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి 40 లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎ. సురేష్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప, డివైఎఫ్ఐ నాయకులు ఉదయ్, విరేంద్ర, రవి, వినోద్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు,

# బుద్ధిమాంద్యం బాలికల బంగారు భవిష్యత్తే లక్ష్యం..

## ఎసెఏ అసిస్టెంట్ విజయ లలిత

ఎమ్మిగనూర సెప్టెంబర్ 16,( విభారె) ) --సమాజంలో సమానంగా అందరి పిల్లలు మాదిరిగానే బుద్ధి మాంద్యం గల పిల్లలు ఎదగాలనే తపనతో ఎంఎస్ జెడ్పిహెచ్ (బాలికల)పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న విజయలలిత తమ అఖుంటిత దీక్షతో,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌసియా బేగం సహాయసహకారములతో పదవ తరగతి పూర్తి చేసుకున్న సిడబ్ల్యు ఎస్ఎన్ బాలికలు అయిన నాగలక్ష్మి, రత్నమ్మ,సుజాతలకు ప్రభుత్వ జూనియర్ కాలేజ్(బాలికల)ఇంటర్ లో హెచ్ఈసి (తెలుగు) మీడియం,హైమావతి అనే అమ్మాయి కోరిక మేరకు ప్రైవేటు కాలేజి లో రాయితీ ఫీజ్ తో ఎంపిసి ఇంగ్లీషు మీడియం లో ప్రవేశం కల్పించారు. ఈసందర్భంగా స్కూల్ అసిస్టెంట్ విజయలలిత మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌసియా బేగం సహాయ సహకారములతో సమాజంలో మంచిగా ఉన్న విద్యార్థులు మాదిరిగానే కుటుంబంనకు,సమాజానికి భారంగా ఉండ కూడదనే ధృఢ నిశ్చయం తో పదవ తరగతి పూర్తి చేసుకున్న సిడబ్ల్యుఎస్ఎన్ బాలికలనువారి ఉన్నత చదువులు చదివించుకోవాలని, వారి కాళ్ళ పై వారు నిలబడే విధంగా వారి తల్లిదండ్రులకు అనేక రకాలుగా నచ్చజెప్పి ఈరోజు ఆ విద్యార్థినులను కాలేజి లో చేర్పినందుకు చాలా సంతోషంగా ఉందని, వారి ముఖాల్లో ఆనందం చూడటమే మా లక్ష్యం అని తెలిపారు. అలాగే ఒక అమ్మాయి కి ఫించన్ రాకపోవడంతో సదరం క్యాంపు నుండీ ప్రత్యేకంగా సదరం ధ్రువీకరణ పత్రం తెప్పించి మరీ ఫించన్ తెప్పించామని తెలిపారు,

# ప్రభుత్వ విద్యాసంస్థల ఏర్పాటుకై ఆర్డీఓ కార్యలయం ముట్టడి

## ఆదోని విద్యార్థి సంఘాల జేఏసీ



కౌతాళం సెప్టెంబర్ 16,( విభారె): ఆదోనిలో ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని , ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని కోరుతూ ఆదోని విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదోని ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ గౌరవ సలహాదారులు సాబీర్ బాష,గౌరవ అధ్యక్షులు రామాంజనేయులు,జేఏసీ చైర్మన్ నాగరాజు,కన్వీనర్ శ్రీనివాసులు,మీడియా ఇంఛార్జి రమేష్ మాట్లాడుతూ ఆదోని పట్టణంలో ప్రభుత్వ విద్యారంగ సంస్థలు లేక గ్రామీణ,పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దశాబ్దాలుగా ఆదోని లో ప్రభుత్వ విద్యారంగ సంస్థలు ఏర్పాటు చేయాలని అనేక విద్యార్థి సంఘాలు పోరాడుతున్న ఇక్కడ ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు లేక,అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వ ప్రజాప్రతినిధులు స్పందించి ఆదోనిలో ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని,ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ రామకృష్ణ రెడ్డి గారికి వినతిపత్రం అందజేశారు. ఆర్డీఓ గారు మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆదోని లో విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ లు శివరాం,శివలోకేశ్, రామకృష్ణ,తేజ,పవన్ , జేఏసీ కమిటీ సభ్యులు సోమశేఖర్, సూర్య,దస్తగిరి, నాగరాజు,మల్లి, జయకర్,రాజరత్నం,మరియు తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో

తుగ్గలి సెప్టెంబర్ 16,( విభారె) మండల కేంద్రమైన తుగ్గలి లో గల గ్రామ సచివాలయ కార్యాలయాన్ని తుగ్గలి ఎంపీడీవో వీర రాజు గురువారం రోజున ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా సచివాలయంకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా సచివాలయ ఉద్యోగ యొక్క వ్యక్తిగత రికార్డులను,మూమెంట్ రిజిస్టర్ల ను మరియు ఉద్యోగుల హాజరు పట్టికలను పరిశీలించారు. అదేవిధంగా సచివాలయ పరిధిలోని గల గ్రామ వాలంటీర్ల యొక్క రికార్డులను కూడా తనిఖీ చేశారు.

# పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి



నంద్యాల సెప్టెంబర్ 16,( విభారె):- నంద్యాల పట్టణంలో గురువారం నాడు లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా మొదటి రోజు రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ మౌలానా ముస్తాక్ అహ్మద్, సిపిఐ సీనియర్ నాయకులు సలాం ఖాన్, ఐయు యమ్ యల్ . జిల్లా సలాం మౌలానా లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నంద్యాల డివిజన్ నాయకులు ఖాజాఫరీద్,జకీర్, అబ్దుల్ హాకీం,శుభ, రఫీ,రషీద్, కూర్చున్నారు . ఈ దీక్షలకు పిడిఎస్ యు జిల్లా సహాయ కార్యదర్శి రఫీ అధ్యక్షతన జరిగింది. ఈ దీక్ష శిబిరాన్ని టిడిపి మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ దీక్షలకు ముఖ్యఅతిథిగా టిడిపి పార్టీ జిల్లా కార్యదర్శి ఫిరోజ్ . అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చింతల్ మోహన్ రావు. ఆవాజ్ జిల్లా కన్వీనర్ మస్తాన్ వలి టిడిపి కౌన్సిలర్లు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీ రాములు,

## లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక డిమాండ్

సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరసింహులు, ప్రగతిశీల సంఘం జిల్లా నాయకులు నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసు, చింతల య, ప్రసాద్, మస్తాన్, జమాతే ఇస్లామ్ నంద్యాల అధ్యక్షుడు సమద్, మోమిన్ గౌస్, జిల్లా అధ్యక్షులు కరిముల్లా మస్తాన్ , ఆవాజ్ యువజన అధ్యక్షులు సద్దాం, మద్దతిచ్చారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మ రెడ్డి, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర మౌలానా ముస్తాక్ అహ్మద్, టిడిపి నంద్యాల పార్లమెంట్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ పెట్రోలు డీజిల్ రేట్ లను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ఇంటి ,చెత్త ,కుళాయి, మురుగుకాలువ పన్ను ,రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ వ్యవసాయ బిల్లును రద్దు చేయాలన్నారు.

# రవాణా రంగం బ్రతకాలంటే నరేంద్ర మోడీని గద్దె దించవలసిందే:సిఐటియూ

డోన్ నంద్యాల సెప్టెంబర్ 16,( విభారె): -:రవాణా రంగం బ్రతకాలంటే నరేంద్ర మోడీ ని గద్దె దించవలసిందే నని మోటర్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి శివరాం అన్నారు, స్థానిక మోటర్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం నందు గురువారం ఉదయం యూనియన్ ఉపాధ్యక్షులు లక్ష్మన్న అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో రెండవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, కార్మికులు బ్రిటిష్ కాలం నుండి పోరాడి ప్రాణ త్యాగాల తో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మిక హక్కులను కుదిస్తూ పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్ లు గా చట్టాలు చేయడం దుర్మార్గం అన్నారు. లారీ డ్రైవర్ ల మెడకు ఉరితాడు లాంటి జీవో నెంబర్ 21 ని తేవడం సిగ్గు చేటన్నారు,మరో వైపు గిట్టుబాటు బాడుగలు లేక అసలే సంక్షోభంలో ఉన్న రవాణా రంగంపై పెట్రోల్ డీజిల్ విడిభాగాల ధరలు రోజు రోజుకు పెంచడం ఆ రంగంపై ఆధారపడిన చిన్నచిన్న యజమానుల నుండి రవాణా రంగాన్ని దూరం చేసి కార్పొరేట్ శక్తుల చేతికి అప్పనంగా అప్పగించడానికి? అన్నారు. ఇటువంటి చర్యలు రవాణా మరియు దాని అనుబంధ రంగాలపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులను రోడ్డు పాలుచేయడమే నన్నారు. ప్రజల ఆందోళనలను ఈ ప్రభుత్వం లెక్క చేయడం లేదని ఢిల్లీ శివార్లలో 10 నెలలుగా రైతులు చేస్తున్న మహా ఉద్యమమే దీనికి నిదర్శనమన్నారు,రైతుల హక్కులు,కార్మికుల హక్కులు కాపాడుకోవాలంటే నరేంద్ర మోడీని గద్దె దించడమే ఏకైక మార్గం అన్నారు. అందుకే సంయుక్త కిసాన్మోర్చా ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన భారత్ బంద్ దీనికి నాంది కావాలని కనుక రవాణా రంగ కార్మికులు అందరూ బందును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు జి. కొండయ్య సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు బి.నాగమదయ్య వి. రామాంజనేయులు,నాగన్న, నారాయణ,కిట్టు,శివ,రామచంద్రుడు,తిమ్మారెడ్డి,రాజన్న,వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కోసం స్టార్ టెక్నీషియన్ రంగంలోకి..!



ఎన్టీఆర్.. కొరటాల శివ కాంబోలో మూవీ పట్టాలెక్కబోతుంది. ఆర్ ఆర్ ఆర్ సినిమా ను ముగించిన ఎన్టీఆర్ ఏ క్షణంలో అయినా కొరటాల శివ దర్శకత్వంలో సినిమాను మొదలు పెట్టవచ్చు అంటూ ఆమధ్య వార్తలు వచ్చాయి. కాని కొన్ని కారణాల వల్ల సినిమాను అక్టోబర్ చివర్లో లేదా నవంబర్ మొదటి వారంలో పట్టాలెక్కించేలా ప్లాన్స్ చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఎన్టీఆర్ ఈ సినిమా లో కొత్తగా కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. స్టూడెంట్ లీడర్ గా ఈ సినిమాలో ఎన్టీఆర్ ను కొరటాల శివ చూపించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమా లో ఎన్టీఆర్ ను ప్రత్యేకంగా చూపించేందుకు గాను స్టార్ టెక్నీషియన్ సినిమాటోగ్రాఫర్ రత్నవేల్ ను రంగంలోకి దించబోతున్నట్లుగా తెలుస్తోంది. ఎన్టీఆర్30 కోసం రత్నవేల్ ను సంప్రదించడంతో పాటు దర్శకుడు కొరటాల శివ ఆయనతో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించేలా చేయబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇక ఈ సినిమాలో హీరోయిన్ గా ఆలియా భట్ ను నటింపజేసే విషయమై చర్చలు జరుగుతున్నాయి. పాన్ ఇండియా మూవీగా భారీ ఎత్తున అంచనాల నడుమ ఈ సినిమాను రూపొందిస్తున్న కొరటాల శివ టెక్నీషియన్స్ మరియు నటీ నటుల విషయంలో ఏమాత్రం రాజీ లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నాడని సమాచారం అందుతోంది. అందుకే కాస్త ఎక్కువ బడ్జెట్ అవుతున్నా కూడా స్టార్ సినిమాటోగ్రాఫర్ రత్నవేల్ ను ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నట్లుగా సమాచారం అందుతోంది. ఈమధ్య కాలంలో రత్నవేల్ సరిలేరు నీకెవ్వరు సినిమాకు వర్క్ చేశారు. అంతకు ముందు శంకర్ సినిమా రోబో.. సుకుమార్ సినిమా నేనొక్కడినే.. చిరంజీవి సినిమాలు ఖైదీ నెం.150 మరియు సైరా నరసింహా రెడ్డి లకు ఈయనే కెమెరా పట్టాడు. ఆ సినిమాల విజువల్స్ ఏ రేంజ్ లో ఉంటాయో అందరికి తెల్సిందే. భారీ ఎత్తున యాక్షన్ సన్నివేశాలను ఈయన కెమెరాలో బంధించే విధానం అందరికి తెగ నచ్చుతుంది. అందుకే ఈయన ఎన్టీఆర్ 30 కి వర్క్ చేస్తున్నాడు అంటే అభిమానులు చాలా హ్యాపీ ఫీల్ అవుతున్నారు. రత్నవేల్ జాతీయ స్థాయి టెక్నీషియన్ అని.. పాన్ ఇండియా మూవీకి ఆయన సరిగ్గా సెట్ అవుతాడు అంటూ ఎన్టీఆర్ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

# ఫుల్ ఫామ్ లో ఉన్న మణిశర్మ తనయుడు మహతి..!

టాలీవుడ్ లో ప్రస్తుతం కీరవాణి - మణిశర్మ - దేవిశ్రీప్రసాద్ - ఎస్.ఎస్ థమన్ వంటి సంగీత దర్శకులు జోరు చూపిస్తుంటే.. మరోవైపు యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ మహతి స్వర సాగర్ వరుస అవకాశాలతో వారికి పోటీగా దూసుకుపోతున్నాడు. చిన్న మీడియం రేంజ్ సినిమాలకు ఏకైక ఛాయిస్ గా మారిన మహతి.. వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వస్తున్నాడు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ తనయుడే మహతి స్వర సాగర్. ఇంతకముందు 'ఛలో' 'భీష్మ' 'అశ్వద్ధామ' 'ఇష్క్ నాట్ ఏ లవ్ స్టోరీ' వంటి సినిమాలకు సూపర్ హిట్ ఆల్బమ్స్ అందించి మంచి పేరు తెచ్చుకున్నాడు. బ్యాగ్రౌండ్ స్కోర్ ఇవ్వడంలో తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నాడు. మణిశర్మ వర్క్ చేసే సినిమాలన్నింటికీ కొడుకు మహతి సహకారం కూడా ఉంటుందనే సంగతి తెలిసిందే. ప్రస్తుతం చేతిలో ఏడెనిమిది ప్రాజెక్ట్స్ పెట్టుకొని మహతి స్వర సాగర్ ఫుల్ ఫార్మ్ లో ఉన్నాడు. ఇప్పటికే నితిన్ హీరోగా రూపొందిన 'మాస్ట్రో' సినిమాకి చార్ట్ బస్టర్ ఆల్బమ్ అందించాడు. ఈ నెల 17న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నితిన్ అప్ కమింగ్ ప్రాజెక్ట్ 'మాచర్ల నియోజకవర్గం' చిత్రానికి కూడా మహతినే సంగీతం సమకూరుస్తున్నాడు. ఇది నితిన్ తో యువ సంగీత దర్శకుడు వర్క్ చేసే నాలుగో సినిమా అవుతుంది. అలానే మెగా అల్లుడు కళ్యాణ్ దేవ్ హీరోగా నటిస్తున్న 'కిన్నెరసాని' చిత్రానికి మహతి మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇటీవల విడుదలైన టీజర్ కు అందించిన నేపథ్య సంగీతం విశేషంగా అలరించింది. బెల్లంకొండ గణేశ్ హీరోగా పరిచయమవుతున్న 'స్వాతిముత్యం' సినిమాతో పాటుగా.. మంచు విష్ణు - శ్రీను వైట్ల కాంబోలో వస్తున్న 'డీ డ డీ' చిత్రానికీ స్వర సాగర్ సంగీతం అందిస్తున్నాడు. ఇక పాయల్ రాజ్ పుత్ లీడ్ రోల్ లో వస్తున్న '5చిబ' సినిమా కూడా ఆయన చేతిలోనే ఉంది. ఇదే క్రమంలో మెగాస్టార్ చిరంజీవి - మెహర్ రమేష్ కాంబినేషన్ లో రూపొందే 'భోళా శంకర్' చిత్రానికి మ్యూజిక్ కంపోజ్ చేసే అవకాశం మహతి సాగర్ దక్కించుకున్నాడని తెలుస్తోంది. ఇప్పటి వరకు చిన్న మీడియం రేంజ్ సినిమాలే చేసిన మహతి కి.. ఇది మెగా ఛాన్స్ అనే చెప్పాలి. చిరు కు మణిశర్మ ఎన్నో బ్లాక్ బస్టర్ ఆల్బమ్స్ ఇచ్చాడు. ఇప్పుడు మణి తనయుడు చిరంజీవి చిత్రానికి ఎలాంటి సాంగ్స్ ఇస్తాడో చూడాలని అందరూ ఆసక్తిగా ఉన్నారు. 'భోళా శంకర్' అనౌన్స్ మెంట్ వీడియోకి అందించిన బీజీఎమ్ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ సినిమాతో మహతి సాగర్.. టాప్ మ్యూజిక్ డైరెక్టర్ జాబితాలోకి చేరుతాడేమో చూడాలి.



# ఓటీటీలో వెంకీమామ మరో మూవీ..?



మలయాళంలో సూపర్ హిట్ అయిన 'దృశ్యం 2' చిత్రాన్ని విక్టరీ వెంకటేష్ హీరోగా తెలుగులో అదే పేరుతో రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. మాతృకను డైరెక్ట్ చేసిన జీతూ జోసెఫ్ ఈ థ్రిల్లర్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. అయితే మాతృక బాటలోనే ఓటీటీలో రిలీజ్ చేస్తారా? లేదా థియేట్రికల్ రిలీజ్ కు వెళ్తారా? అనే దానిపై ఇప్పటి వరకు క్లారిటీ రాలేదు. ఈ నేపథ్యంలో "దృశ్యం 2" విడుదల గురించి ఓ ఆసక్తికర న్యూస్ చక్కర్లు కొడుతోంది. మేకర్స్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ ఓటిటి విధానంలోనే రిలీజ్ చేయడానికి రెడీ అయ్యారట. ప్రముఖ డిజిటల్ ఫ్లాట్ ఫార్మ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా స్ట్రీమింగ్ అవ్వనుందని టాక్ నడుస్తోంది. దసరా కానుకగా ఈ సినిమాను ఓటీటీ విడుదల చేయాలని చూస్తున్నారని.. దీనికి తగినట్లు చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలు మొదలు పెట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన 'నారప్ప' చిత్రాన్ని అమెజాన్ ప్రైమ్ లో విడుదల చేసారు. ఈ క్రమంలో ఇప్పుడు 'దృశ్యం 2' చిత్రాన్ని డిజిటల్ వేదికలో స్ట్రీమింగ్ పెట్టాలని చూస్తున్నారు. దీనికి సంబంధించిన అఫీషియల్ అనౌన్సెమెంట్ త్వరలోనే జరగనుందని సమాచారం. కాగా 'దృశ్యం 2' చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై డి. సురేష్ బాబు నిర్మిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం సమకూరుస్తున్నారు. ఇందులో వెంకటేష్ సరసన మీనా హీరోయిన్ గా నటించింది. 'దృశ్యం' సినిమాతో సక్సెస్ అందుకున్న వెంకీ.. ఈ సీక్వెల్ తో ఎలాంటి విజయాన్ని నమోదు చేస్తాడో చూడాలి.

# టి20 ప్రపంచకప్ తర్వాత టీమిండియాకు కొత్త కోచ్!



టీమిండియా ప్రధాన కోచ్ బాధ్యతల నుంచి రవిశాస్త్రి తప్పుకోనున్నాడని సమాచారం. యూఏఈ వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్ తర్వాత రవిశాస్త్రి కోచ్ బాధ్యతల నుంచి పక్కకు తప్పుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ మాత్రం రవిశాస్త్రిని దక్షిణాఫ్రికా పర్యటన వరకు కోచ్ పదవిలో ఉండాలని కోరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే రవిశాస్త్రి మాత్రం టి20 ప్రపంచకప్ తర్వాతే వైదొలిగేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇక రవిశాస్త్రి తర్వాత టీమిండియా ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టేది ఎవరనే దానిపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం మాత్రం కోచ్ పదవి రాహుల్ ద్రవిడ్‌నే వరిస్తుందని చాలా మంది భావిస్తున్నారు. రాహుల్ ద్రవిడ్ పర్యవేక్షణలోనే టీమిండియా-ఏ జట్టు రాటు దేలడం.. ఆపై సీనియర్ టీమ్ గైర్హాజరీలో టీమిండియా రెండో టీమ్ శ్రీలంక పర్యటనకు వెళ్లింది. ఆ పర్యటనకు రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. అంతేగాక టీమిండియా ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ జట్టుకు ఎంతో ఉపయోగపడతాడని.. అతని సలహాలతో జట్టు మంచి ప్రదర్శన ఇస్తుందనేది చాలా మంది అభిప్రాయం. ఇక టీమిండియాకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన వారిలో అత్యంత విజయవంతమైన కోచ్‌గా గ్యారీ కిర్‌స్టెన్ నిలిచాడు. 2011 వన్డే వరల్డ్‌కప్‌తో పాటు.. 2013 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ టీమిండియా గెలవడంతో కోచ్‌గా కిర్‌స్టన్ పాత్ర కీలకం. 2017లో కిర్‌స్టెన్ కోచ్ పదవి నుంచి తప్పుకున్నాకా రవిశాస్త్రి టీమిండియా హెడ్ కోచ్‌గా నియామకమయ్యాడు. ధోని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవడం.. కోహ్లి కెప్టెన్ కావడం.. ఆ తర్వాత ఈ ఇద్దరు కలిసి టీమిండియాకు మంచి విజయాల్ని కట్టబెట్టారు. రవిశాస్త్రి కోచ్‌గా వచ్చిన తర్వాత కోహ్లి నాయకత్వంలో టీమిండియా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లను స్వదేశంతో పాటు వారి గడ్డపై ఓడించి చరిత్ర సృష్టించింది. దీంతోపాటు ఎన్నో సిరీస్‌ల్లోనూ వీరి జోడి పర్‌ఫెక్ట్‌గా కనిపించింది. కోహ్లి కూడా రవిశాస్త్రి నిర్ణయాలతో ఏకీభవిస్తూ.. అతనికి మద్దతుగా నిలుస్తూ వచ్చాడు. అయితే ఐసీసీ మేజర్ టోర్నీలకు వచ్చేసరికి మాత్రం రవిశాస్త్రి కోచ్‌గా సక్సెస్ కాలేకపోయాడనే చెప్పాలి. 2017 చాంపియన్స్ ట్రోఫీ, 2019 వన్డే ప్రపంచకప్.. తాజాగా ఐసీసీ టెస్టు చాంపియన్ ఫైనల్లోనూ టీమిండియా అపజయాలే చూసింది. కేవలం ఐసీసీ లాంటి మేజర్ టోర్నీల్లోనే కోచ్‌గా విఫలమయ్యాననే కారణంతో రవిశాస్త్రి కోచ్ పదవి నుంచి తప్పుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే, కోచ్‌గా రవిశాస్త్రి తప్పుకుంటున్నాడనే దానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఒకవేళ అదే నిజమైతే.. టి20 ప్రపంచకప్ తర్వాత రవిశాస్త్రి స్థానంలో ద్రవిడ్‌ను తాత్కాలిక కోచ్‌గా నియమించే అవకాశం ఉంటుంది. అయితే ద్రవిడ్ మాత్రం ఎన్‌సీఏ చీఫ్ కోచ్‌గా ఉండడానికి ఈ మధ్యనే మరోసారి దరఖాస్తు చేసుకున్నాడు. దీనిని గమనిస్తే.. టీమిండియా హెడ్ కోచ్‌గా పనిచేయడానికి ద్రవిడ్ సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. మరో విషయం ఏంటంటే రవిశాస్త్రి కోచ్‌గా వైదొలిగిన తర్వాత అతని టీమ్‌లోని బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ కోచ్‌లకు కూడా బీసీసీఐ ఉద్వాసన పలకనున్నట్లు సమాచారం. ఒకవేళ టీమిండియాకు కొత్త కోచ్ వస్తే గనుక కొత్త టీమ్‌ను తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**